


జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో (డీఎంఅండ్‌హెచ్‌వో) పాలన గాడితప్పింది. బదిలీపై జిల్లాకు డిప్యూటీ డెమోగా వచ్చిన అధికారి, అనధికార డెప్యుటేషన్‌పై పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులు తమదైన శైలిలో 'ధన'కార్యాలు చక్కబెడుతున్నారని విమర్శలు వస్తున్నాయి. డీఎంఅండ్‌హెచ్‌వో సంతకాలను సైతం ఫోర్జరీ చేసి ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతులు, రెన్యువల్స్ చేసి భారీగా వసూళ్లకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. త్వరలో నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న యుగంధర్ కార్యాలయ పాలన ప్రక్షాళనలో ఎటువంటి నిర్ణయాలు తీసుకుంటారో వేచిచూడాలి.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

ధనకార్యాలు!

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవినీతి కంపు!

- ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతులు, రెన్యువల్స్‌లో భారీగా వసూలు
- గత డీఎంఅండ్‌హెచ్‌వో సంతకాలు ఫోర్జరీ చేసి మరీ ఫైల్స్ క్లియర్!
- డిప్యూటీ డెమోగా వచ్చిన మహిళా అధికారి తీరుపై విమర్శలు
- అనధికార డెప్యుటేషన్‌పై వచ్చిన మరో ఇద్దరు ఉద్యోగులది అదే అవినీతి దారి!

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: మచిలీపట్నంలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో అవినీతి రాజ్యమేలుతోంది. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి కొందరు ఉద్యోగులు వసూళ్లకు పాల్పడుతున్నారని విమర్శలు వ్యక్త మవుతున్నాయి. గతంలో ఘంటసాల మండలం శ్రీకాకుళం పీహెచ్‌సీలో పనిచేసే హెల్త్ ఎడ్యుకేటర్‌ను, మచిలీపట్నం రైలుపేటలోని అర్బన్ హెల్త్‌సెంటరులో పనిచేసే శానిటరీ అటెండర్‌ను అనధికారికంగా డెప్యుటేషన్‌పై డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయానికి తీసుకువచ్చారు. అధికారుల చేతికి మట్టి అంటకుండా ఈ ఇద్దరికి కీలకమైన బాధ్యతలను అప్పగించారు. వీరు జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులు, ల్యాబ్‌లు, నర్సింగ్ కళాశాలలకు అనుమతులు, రెన్యువల్స్ చూస్తారు. రైలుపేట అర్బన్ హెల్త్ సెంటరులో పనిచేసే శానిటరీ అటెండర్‌కు ఈ విభాగంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా బాధ్యతలు అప్పగించడంతో, ఈ ఉద్యోగి ప్రతి పనిలో తలదూర్చి, ఒక్కో ఫైల్ కదలాలంటే ఇంత ధర నిర్ణయించి మరీ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని కార్యాలయ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. గతంలో ఇక్కడ పనిచేసి పదవీ విరమణ చేసిన డీఎంఅండ్‌హెచ్‌వోకు ఈ ఇద్దరు నమ్మకస్తులుగా ఉండటం, వీరికి పూర్తి స్వేచ్ఛను ఇవ్వడంతో, వీరు తమదైన శైలిలో తెరవెనుక చక్రం తిప్పి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. ఆ డీఎంఅండ్‌హెచ్‌వో పదవీ విరమణ చేసి వెళ్లిన తర్వాత కూడా వీరిని ఇక్కడ కొనసాగించడం గమనార్హం. వీరు చేసిన అక్రమాలపై ఇటీవల వైద్యశాఖ ఉన్నతాధికారులకు పలు ఫిర్యాదులు అందాయి. వీటిపై విచారణకు అధికారులు ఆదేశించినా, విచారణ చేయకుండా జాప్యం చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డీఎంహెచ్‌వోకు తెలియకుండానే ఆస్పత్రులకు అనుమతులు

మూడు నెలల క్రితం ఏలూరు జిల్లా నుంచి బదిలీపై జిల్లాకు డిప్యూటీ డెమో(డిస్ట్రిక్ ఎక్స్‌టెన్షన్ మాస్ మీడియా ఆఫీసర్)గా ఒక మహిళా అధికారి వచ్చారు. ఆమె వచ్చీ, రావడంతోనే జిల్లాలోని ప్రైవేటు ఆస్పత్రులకు చకచకా అనుమతులు మిగతా 8లో..

అవినీతి ఉద్యోగులపై వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు

ఏలూరు జిల్లాలో పనిచేసిన సమయంలోనూ ఈ మహిళా అధికారి తనదైన శైలిలో ప్రైవేటు ఆస్పత్రులకు అనుమతులు ఇచ్చారని, ఈ విషయం అలస్యంగా బయటకు వచ్చిందని సమాచారం. దీనిపై వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. మహిళా అధికారిపై వచ్చిన ఆరోపణలకు సమాధానం చెప్పాలని వైద్యశాఖ రీజనల్ డైరెక్టర్ ఇటీవల షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిసింది. కృష్ణాజిల్లాతో పాటు, ఏలూరు జిల్లాలోనూ ప్రైవేటు ఆసుపత్రులకు తనదైన శైలిలో అనుమతులు ఇచ్చిన ఈ డెప్యూటీ డెమోపై చర్యలు తప్పవని కార్యాలయ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. ఇటీవల కృష్ణా డీఎంఅండ్‌హెచ్‌వోగా అనంతపురం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐవో)గా పనిచేస్తున్న టి.యుగంధర్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన నాలుగైదు రోజుల్లో ఇక్కడ బాధ్యతలు చేపడతారని కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు. ఆయన వచ్చాక డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో పరిపాలనను గాడినపెట్టాలని వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న పలువురు ఉద్యోగులు కోరుతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యశాఖ కమిషనర్ రామశంకర నాయక్, చిత్రంలో జేడీ నాగరాజా తదితరులు



ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి

- ఇప్పటి వరకు 41 శాతమే పూర్తి
- రైతులు సత్వరం నమోదు చేసుకోవాలి
- ఐరోపా దేశాలకు ఆక్వా ఉత్పత్తుల ఎగుమతి
- మత్స్యశాఖ కమిషనర్ రామశంకరనాయక్

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి అని మత్స్యశాఖ కమిషనర్ రామశంకరనాయక్ అన్నారు. ఆక్వా జోన్ మ్యాపింగ్ సర్వే ద్వారానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. మచిలీపట్నంలో ఎఫ్‌డీవోలు, ఏడీలు, సాగర మిత్రలతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రామ శంకర నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 5,97,690 ఎకరాల్లో ఆక్వా సాగవుతుంటే, ఇప్పటికి కేవలం 2, 40, 390 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్‌లో అయ్యాయన్నారు. వాస్తవానికి 16వ తేదీతో గడువు ముగుస్తుందని, అయితే ప్రభుత్వం మరో 15 రోజులు గడువు పొడిగిస్తుందన్నారు. గ్రామస్థాయిలో పడవల సంఖ్య, సాగు విస్తీర్ణం, ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ స్థాయిలో చెరువుల్లో సాగవుతున్న చేపల సాగు విస్తీర్ణ వివరాలను కూడా ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. పండుతున్న రొయ్యలు, చేపల వివరాలు సత్వరం నమోదు చేయాలన్నారు. అమెరికాకు రొయ్యలు, చేపల ఎగుమతులు ఆగిపోయినందున ఆక్వా రైతులు నష్టపోకుండా నూతన ప్రణాళిక రూపొందించామన్నారు. ఐరోపా ఖండంలోని దేశాలకు ఎగుమతులు పంపేందుకు యోచిస్తున్నామన్నారు. ఇందుకు గాను రైతులు పండించే రొయ్యలు గ్లోబల్ ప్రమాణాలకు తగిన విధంగా పండించాలన్నారు. మత్స్య సహకార సంఘాలు ఇందుకు చొరవ చూపాలని కోరారు. ఎన్‌ఎఫ్‌డీపీ కింద నమోదు చేస్తే పీఎఫ్ఎంఎస్ స్కీం కింద ఇన్సూరెన్స్ కవరేజి వచ్చే అవకాశం ఉందన్నారు. క్లస్టర్ స్థాయిలో రైతులను చైతన్య పరచాలన్నారు. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ సాగయ్యే కొత్తరకం రొయ్యలను తీసుకుని వస్తున్నామన్నారు. మోడల్ హేచరీల్లో నాణ్యత గల రొయ్యల పిల్లలను పెంచి రైతులకు అందించాల్సి ఉందన్నారు. రొయ్యల పిల్లలకు వచ్చే వ్యాధులను గుర్తించేందుకు సైంటిస్టులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని వివరించారు. ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన వర్తింప జేసేందుకు అధికారులందరూ సహకరించాలన్నారు. ఐరోపా, జపాన్, మిగతా 8లో..

మెగా విజయవాడ

- 75 గ్రామాల విలీనంతో మరోసారి గ్రేటర్ ప్రతిపాదనలు
- 500 చదరపు కిలోమీటర్ల పైగా విస్తరణకు అవకాశం
- గతంలో 45 గ్రామాలు.. తాజాగా మరో 30 కలిపి..
- మైలవరం, గన్నవరం, పెనమలూరు మండలాల్లోని గ్రామాలు కూడా..
- తాడిగడప, కొండపల్లి మున్సిపాలిటీలు రద్దేనా?
- ప్రభుత్వానికి చేరిన కొత్త ప్రతిపాదనలు
- ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయమే తరువాయి



మెగా విజయవాడ విస్తరణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఉమ్మడి కృష్ణాజిల్లాలో మొత్తం 75 గ్రామాలతో గ్రేటర్ ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ఈ ప్రతిపాదనలు ప్రభుత్వానికి చేరాయి. దీనిపై ముఖ్యమంత్రి స్థాయిలో నిర్ణయం తీసుకోవటమే మిగిలి ఉంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో గ్రేటర్ విజయవాడ దిశగా అడుగులు పడ్డాయి. అప్పట్లో 45 గ్రామాలను విజయవాడలో విలీనం చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదించగా, పంచాయతీల నుంచి తీర్మానాలు తీసుకున్నారు. నాలుగైదు తప్ప దాదాపు అన్ని పంచాయతీలు గ్రేటర్‌లో విలీనానికి సానుకూలంగా తీర్మానాలు చేసి పంపాయి. ఆ సమయంలో ఎన్నికలొచ్చాయి. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ గ్రేటర్ విజయవాడ కాకుండా.. విలీన ప్రతిపాదిత జాబితాలో ఉన్న గ్రామాలను కొన్నింటినే కలుపుతూ మున్సిపాలిటీలుగా చేసింది. అమరావతి రాజధానిపై ఉన్న కోపాన్ని విజయవాడ నగరాభివృద్ధిపై చూపించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి గ్రేటర్ విజయవాడను తెరపైకి తెచ్చింది. పంచాయతీ ప్రతినిధులు కూడా గ్రేటర్ విజయవాడ గురించి ప్రశ్నిస్తుండటంతో ఎంపీ కేశినేని శివనాథ్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ప్రతిపాదనలు పంపించమనటంతో జిల్లా యంత్రాంగం కసరత్తు చేసింది. మునిసిపల్ కమిషనర్‌తో చర్చించి గత ప్రతిపాదనలను పరిశీలించిన మీదట మరో 30 పంచాయతీలను కొత్తగా గ్రేటర్ పరిధిలోకి తీసుకొచ్చారు. కొత్తగా మైలవరం, గన్నవరం, పెనమలూరు మండలాలను పూర్తిగా విలీనం చేయాలని ప్రతిపాదించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

500 చదరపు కిలోమీటర్ల పరిధి పెంచేలా..

ప్రస్తుతం విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 61.88 చదరపు కిలోమీటర్ల పరిధిలో ఉంది. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో 45 గ్రామాలను విలీనం చేసి అదనంగా 341.82 చదరపు కిలోమీటర్ల పరిధిని కలిపి మొత్తంగా 403.7 చదరపు కిలోమీటర్ల పరిధికి పెంచాలని నిర్ణయించారు. తాజాగా మరో 30 గ్రామాలను పెంచటం ద్వారా 500 చదరపు కిలోమీటర్ల పైబడి గ్రేటర్ విజయవాడ పరిధిని పెంచేందుకు ఆస్కారం ఏర్పడింది.

మొత్తం 75 పంచాయతీలు

గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మొత్తం 45 పంచాయతీలను గ్రేటర్ విలీన ప్రతిపాదన జాబితాలోకి తీసుకొచ్చారు. వీటిలో కానూరు, పోరంకి, తాడిగడప, యనమలకుదురు, పెనమలూరు, గంగూరు, గోసాల, ఈడుపుగల్లు, పునాదిపాడు, కంకిపాడు, వేల్పూరు, ఉప్పులూరు, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, దొనె ఆత్కూరు, గూడవల్లి, కేసరపల్లి, వెంకటనరసింహాపురం, అజ్జంపూడి, బుద్ధవరం, గన్నవరం, వెదురుపావులూరు, సావారుగూడెం, జక్కులనెక్కలం, రామచంద్రాపురం, పురుషోత్తపట్నం, బీబీగూడెం, చిన్న అవుటపల్లి, అల్లాపురం, నున్న, పాతపాడు, పిర్యాది నైనవరం, అంబాపురం, జక్కంపూడి, గొల్లపూడి, విద్యాధరపురం, తుమ్మలపాలెం, గుంటుపల్లి, రాయనపాడు, మల్కాపురం, గూడూరుపాడు, కొండపల్లి, ఇబ్రహీంపట్నం ఉన్నాయి. తాజాగా వీటితో పాటు మైలవరం, గన్నవరం, పెనమలూరు మండలాల పరిధిలోని అన్ని గ్రామాలను గ్రేటర్ విలీన ప్రతిపాదిత జాబితాలోకి తీసుకొచ్చారు. దీంతో పంచాయతీల సంఖ్య 75కు చేరింది.

కొండపల్లి, తాడిగడప మున్సిపాలిటీలు రద్దయ్యే అవకాశం

గ్రేటర్ విజయవాడ సరికొత్త ప్రతిపాదనల్లో కొండపల్లి, తాడిగడప మున్సిపాలిటీలు ఉన్నాయి. పెనమలూరు, ఇబ్రహీంపట్నం మండలాలు పూర్తిస్థాయిలో ప్రతిపాదిస్తున్నందున ఈ రెండు మున్సిపాలిటీలు రద్దయ్యే అవకాశం ఉంది.



మెట్రో భూ సేకరణకు అడుగులు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో 70 ఎకరాల గుర్తింపు
- చకచకా సోషియో ఎకనమిక్ సర్వే
- ఈ నెలాఖరులోపే భూసేకరణ నోటిఫికేషన్
- ఈ నెలలోనే మెట్రో టెండర్ల ఖరారు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మెట్రో రైల్ ప్రాజెక్టుకు భూ సేకరణ దిశగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లా యంత్రాంగాలు అడుగులు వేస్తున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 9, కృష్ణాజిల్లాలో 61 ఎకరాల భూములను సేకరించేందుకు అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) ఇచ్చిన భూ ప్రతిపాదనల మేరకు భూములను గుర్తించారు. మెట్రో ప్రాజెక్టు కోసం తీసుకునే భూములకు సంబంధించి సోషియో ఎకనమిక్ ఇంపాక్ట్ సర్వే నిర్వహించారు. ఈ సర్వే ప్రాతిపదికన భూములు, భవనాలు, చెట్లు, ఇతర వాటికి ఎంత నష్టం జరుగుతుందో అంచనా వేయటంతో పాటు భవిష్యత్తులో జరిగే సామాజిక మార్పులను కూడా తెలుసుకున్నారు. ఈ నెలాఖరులోపే నివేదిక వచ్చే అవకాశం ఉంది. ఆ సమయానికే భూ సేకరణ నోటిఫికేషన్‌ను వెలువరించేందుకు యంత్రాంగాలు సిద్ధమవుతున్నాయి.

భూ సేకరణ ఇలా..

ఎన్టీఆర్ జిల్లాలో 9 ఎకరాలే అవసరమవుతాయి. గూడవల్లి నుంచి ఎన్‌హెచ్-16పై నిడమానూరు, ఎనికేపాడు, ప్రసాదంపాడు, రామవరప్పాడు దగ్గర, ఏలూరు రోడ్డుపై రైల్వేస్టేషన్ వరకు మెట్రోస్టేషన్ల నిర్మాణానికి భూములు మిగతా 8లో..



మత్తుతో మేలే!

10

- వైద్య రంగంలో కీలకంగా అనస్థీషియా
- నేడు ప్రపంచ అనస్థీషియా దినోత్సవం

లీటర్లకొద్దీ మద్యం. టిన్నులకొద్దీ స్పిరిట్. ఇబ్రహీంపట్నంలోని అద్దేపల్లి జనార్దనరావు ఏర్పాటుచేసిన నకిలీ మద్యం తయారీ కేంద్రంలో లభించిన సరుకు ఇది. ఇంత సరుకుతో ఎన్నో కేసుల నకిలీ మద్యాన్ని తయారు చేయవచ్చు. అసలు అన్ని నకిలీ మద్యం కేసులను జనార్దనరావు ఏం చేయాలనుకున్నాడు అనే ప్రశ్న ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ సరుకును నెల, రెండు నెలల్లో అమ్మడం సాధ్యం కాదని ఎక్సైజ్ వర్గాలు భావిస్తున్నాయి. సిండికేట్‌లో ఉన్న మద్యం దుకాణాలకు సరఫరా చేయాలని జనార్దనరావు ప్రణాళికలు రూపొందించుకున్నాడని తెలుస్తుండగా, ఇంత భారీగా సరుకు లభించడంతో ఎక్సైజ్ అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

లెక్కలేనంత లిక్కర్

- ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం తయారీ కేంద్రంలో భారీగా సరుకు
- లీటర్లలో మద్యం.. టన్నుల్లో స్పిరిట్.. ఆశ్చర్యపోయిన అధికారులు
- ఫినాయిల్ ముసుగులో తెలంగాణ నుంచి సరఫరా
- ఒక బాటిల్ తయారీకి రూ.22, అమ్మింది మాత్రం రూ.99కు..
- గతనెలలో బార్‌ను దక్కించుకున్న జనార్దనరావు
- అప్పటి వరకు ఉన్న బార్‌ను వదిలేసుకుని..
- రెండో నోటిఫికేషన్‌లో అనూహ్యంగా దరఖాస్తు
- బార్ ఏర్పాటుకు జోగితో పాటు ఓ టీడీపీ నేత సహకారం





ఆంధ్రజ్యోతి-విజయవాడ : అద్దేపల్లి జనార్దనరావు ఒకేసారి నకిలీ మద్యం తయారీని ప్రారంభించలేదు. ముందుగా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యాన్ని సరఫరా చేశాడు. వైసీపీ హయాంలో మద్యం దుకాణాలన్నీ ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచాయి. బార్‌లు మాత్రమే ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో ఉండేవి. ఆ ఐదేళ్ల ఊరూపేరు లేని బ్రాండ్లతో మద్యం సరఫరా అయ్యేది. పైగా మద్యం ధర దేశంలోని అన్ని రాష్ట్రాల కంటే అధికంగా ఉండేది. దీంతో జనార్దనరావు తెలంగాణాలో తక్కువ ధరకు మద్యం సరుకును తీసుకుని దాన్ని ఫినాయిల్ ముసుగులో ఆర్టీసీ మిగతా 8లో..

నిమ్మకూరు అభివృద్ధికి పనిచేయండి

- కలెక్టర్ బాలాజీ

సుబ్బారాయుడి హుండీ ఆదాయం రూ.97.50 లక్షలు

ఆకట్టుకున్న ఇన్నోవేషన్ ఎక్స్‌పో

- విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెరగాలి
- టెక్ మహీంద్ర ఇంజనీరింగ్ హెడ్ వివేకానంద్

8లో



గాజుల అలంకారంలో దుర్గమ్మ(ఫైల్)

22న దుర్గమ్మకు గాజుల అలంకారం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దీపావళి పండుగ వెళ్లిన తరువాత యమద్వితీయ నాడు ఈ నెల 22న ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ గాజుల అలంకారంలో దర్శనమివ్వనున్నారు. హిందూ సంప్రదాయంలో కట్టు, బొట్టుకు ఎంతో ప్రాధాన్యముంది. దుర్గాదేవికి గాజుల అలంకరణ ముఖ్యమైనది. ఇది శ్రేయస్సు, దైవిక స్త్రీ శక్తిని సూచిస్తుంది. అమ్మవారికి గాజుల అలంకారం చేయడం ఒక ఆచార పద్ధతిలో వస్తున్నది. దసరా మహోత్సవాలలో అమ్మవారిని 11రోజుల పాటు దర్శించుకుని మురిసిన భక్తులకు గాజుల అలంకార దర్శనంతో మరింత భక్తి ప్రపత్తులను పెంపొందిస్తుంది. యమ ద్వితీయనాడు మహిళలు తమ పుట్టింటివారి నుంచి ఆశీస్సులు తీసుకుంటారు. ఇదేక్రమంలో భక్తుల ఇలవేల్పు కనకదుర్గమ్మకు గాజులు సమర్పించి ఆశీస్సులు పొందుతారు. ఈ అలంకరణ విశ్వశక్తిని సూచిస్తుంది. దేవస్థానంలో యమద్వితీయనాడు గాజుల అలంకారంలో అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తారు. అందుకు తగ్గవిధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

సుబ్బారాయుడి హుండీ కానుకలు రూ.97.50 లక్షలు

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన కానుకలు, హుండీల ద్వారా రూ.97,50,092 ఆదాయం సమకూరినట్టు ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. బుధవారం దేవస్థానం ప్రాంగణంలో స్వామి కానుకల హుండీల ఆదాయం లెక్కింపు దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో జరిగింది. 97రోజులకుగాను హుండీల లెక్కింపులో రూ.97,50,092 నగదు, కేజీ 450 గ్రాముల వెండి, 41 గ్రాముల 431 మిల్లీగ్రాముల బంగారం, అమెరికన్ డాలర్లు 87, ఆస్ట్రేలియన్ డాలర్లు ఐదు వచ్చాయన్నారు.



నిమ్మకూరులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

నిమ్మకూరు అభివృద్ధికి పనిచేయండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

పామర్రు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరులో అభివృద్ధి పనులు వేగంగా పూర్తిచేసేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండల పరిధిలోని నిమ్మకూరు గ్రామ సచివాలయంలో బుధవారం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గ్రామంలోని శ్రీబుద్దేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.10 కోట్ల నిధుల వినియోగంపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. అనంతరం శిథిలావస్థకు చేరిన ఏపీఆర్‌జేసీ గురుకుల కళాశాల, పాఠశాల హాస్టల్, తరగతి గదుల భవనాలను పరిశీలించారు. డీఎంహెచ్‌వో వెంకట్రావ్, ఎన్ఆర్‌జీఎస్ ఏపీఎం సురేష్, గ్రామ సర్పంచ్ పి.దుర్గాశ్రీనివాస్, టీడీపీ మండలాధ్యక్షుడు కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ నూతక్కి సాంబశివరావు, పీఆర్ ఆర్‌అండ్‌బీ ఈఈలు సుధాకర్‌గౌడ్, లోకేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఈఈ గోవిందరావు, డీవైఈవో పద్మారాణి, ఏపీఆర్‌జేసీ పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాల్స్ లక్ష్మీకుమారి, బ్రాహ్మణేశ్వరి, ఆశా డీడీ సురేష్, ఎంపీడీవో జ్యోతి, తహసీల్దార్ రవికాంత్, ఏవో శివనాగరాణి పాల్గొన్నారు.



ప్రదర్శనను తిలకిస్తున్న అతిథులు

సిద్ధార్థలో ఆకట్టుకున్న ఇన్నోవేషన్ ఎక్స్‌పో

» విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెరగాలి

» టెక్ మహేంద్ర ఇంజనీరింగ్ హెడ్ చల్లా వివేకానంద్

కానూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో బుధవారం ఇన్నోవేషన్ డే వేడుకలు వైభవంగా జరిగాయి. వర్సిటీ, ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్(ఐఐసీ) సంయుక్త ఆధ్వర్యంలో భారత రత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఇన్నోవేషన్ ఎక్స్‌పోలో దేశవ్యాప్తంగా వివిధ కళాశాలలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులు అభివృద్ధిచేసిన 390 మోడల్స్‌ను ప్రదర్శించారు. ప్రదర్శనలో ఉంచిన వినూత్న ఆలోచనలు, సాంకేతిక ప్రతిభ, సమస్యల పరిష్కార నైపుణ్యాలకు సంబంధించిన మోడల్స్ ఆకట్టుకున్నాయి. విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు పెంపొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని టెక్ మహేంద్ర ఇంజనీరింగ్ సర్వీసెస్ టాలెంట్ డెవలప్‌మెంట్ అండ్ ఇండియా గ్రోత్ ఆఫీసర్, హెడ్ (హైదరాబాద్) చల్లా వివేకానంద్ అన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల ఆలోచనలు దేశానికి సాంకేతిక, సామాజిక ప్రగతికి తోడ్పాటునందించాలని విజ్ఞప్తి చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసిన కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల క్యాంపస్ హైరింగ్ సీనియర్ మేనేజర్ జితేందర్ సింగ్ మాట్లాడుతూ, విద్యార్థులు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమ ఆవిష్కరణలను అభివృద్ధి చేయాలని సూచించారు. ఎస్ఏజీటీఈ అధ్యక్షుడు ఎం.రాజయ్య, కార్యదర్శి పి.లక్ష్మణరావు మాట్లాడుతూ, విద్యార్థులు అబ్దుల్ కలాం ప్రేరణతో సృజనాత్మకత, ఆవిష్కరణల దిశగా ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్‌చాన్సలర్ పి.వెంకటేశ్వరరావు, వీసీ ఏవీ రత్నప్రసాద్, రిజిస్ట్రార్ ఎం.రవిచంద్‌తో పాటు పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హైలెవల్ వంతెన కట్టలేరూ?



కట్లలేరు డైవర్షన్ రహదారిలో రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

» వినగడప వద్ద వంతెన కూలి ఏడేళ్లు

» రహదారి మరమ్మతులతోనే సరిపెడుతున్న పాలకులు

» ప్రభుత్వాలు మారుతున్నా పట్టని నేతల తీరు

» అంచనాలు పంపినా మంజూరుకాని నిధులు

» ఇబ్బందులు పడుతున్న తెలుగురాష్ట్రాల ప్రజలు

వినగడపవద్ద 'కట్టలేరు' వంతెన వరదలకు కూలి ఇప్పటికి ఏడేళ్లు పూర్తయింది. ఇది అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా ఉంది. ఏడేళ్లుగా కట్టలేరు వాగు వరద వచ్చిన ప్రతిసారీ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల సుమారు 25 గ్రామాల ప్రజల రాకపోకలు నిలిచిపోతున్నాయి.

(గంపలగూడెం-ఆంధ్రజ్యోతి)

కట్టలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాలకు చేరుకోవాలంటే అదనంగా మరో 30 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తున్నది. ముఖ్యంగా వ్యాపారులు, రైతులు, వ్యవసాయ కూలీలు నష్టపోతున్నారు. వినగడప ఎగువనుంచి మండల కేంద్రమైన గంపలగూడెంకు చదువుకునేందుకు వచ్చే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

వరదల్లో కొట్టుకుపోయిన రెయిలింగ్

1977 సంవత్సరంలో నాటి ఆర్‌అండ్‌బీ శాఖామంత్రి చనుమోలు వెంకట్రావు హయాంలో కట్టలేరు వాగుపై లోబ్రిడ్జి నిర్మాణం జరిగింది. కట్టలేరు ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలం లంకాసాగర్ ఎగువనుంచి ప్రవహిస్తు నందిగామ మండలంలో పెండ్యాల వద్ద మునేరులో కలిసి కృష్ణానదికి చేరుతుంది. వరదలు వచ్చిన ప్రతిసారి వినగడప వద్ద, తిరువూరు మండలంలోని సుమారు ఐదు వాగులు ఈ ప్రాంతంలో కట్టలేరులో కలుస్తుండటంతో, వాగులో నీటి ప్రవాహం మరింత ఉధృతంగా మారుతుంది. 25 సంవత్సరం క్రితం లోలెవల్ బ్రిడ్జి రెయిలింగ్‌లు వరదలకు కొట్టుకుపోయాయి. 2018 ఆగస్టులో భారీ వరదలకు లోబ్రిడ్జితో పాటు సమీపంలోని ఎత్తిపోతల పథకం, గంపలగూడెం తాగునీటి పైపులైన్లు కొట్టుకుపోయాయి.

ఏడేళ్లుగా తాత్కాలిక మరమ్మతులే..

వరదలకు రెయిలింగ్ కొట్టుకుపోవడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అధికారులు, తాత్కాలికంగా డైవర్షన్ రహదారి నిర్మించి రాకపోకలు పునరుద్ధరించారు. అనంతరం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.13కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చినా.. రహదారి మరమ్మతులు మినహా బ్రిడ్జినిర్మాణం చెపట్టలేదు. 2023 మార్చి 17న, వైఎస్ఆర్ విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించేందుకు అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి తిరువూరు పర్యటన సందర్భంలో వినగడప హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. గత ఏడాది ఎన్నికల ముందు బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి జీవో విడుదల చేసి నిధులు మంజూరు చేయకుండా, టెండరు లేకుండా, అప్పటి ఎంపీ కేశినేని నాని బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించి వెళ్లారు.

కూటమి ప్రభుత్వం కనికరించేనా..

2024 సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించి, నిధులు మంజూరు చేయాలని కోరారు. మరోసారి రూ.30 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధంచేసి ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు ఉన్నతాధికారులకు పంపించారు. సాంకేతికంగా అన్ని అనుమతులు వచ్చాయని, బ్రిడ్జి నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే చెబుతున్నా.. ఆచరణలో ఎంతవరకు సాధ్యం అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వరదలు వచ్చిన ప్రతిసారి టీడీపీ నేతలు సొంత నిధులతో డైవర్షన్ రహదారి మరమ్మతుపనును నిర్వహిస్తున్నారు. ఇప్పటికైనా బ్రిడ్జి నిర్మాణం చెపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అక్రమ నిర్బంధంపై విచారణ జరపండి

» భార్యాభర్తలను అక్టోబరు 28న అరెస్ట్ చేశారా? నవంబరు 1న అరెస్ట్ చేశారా తేల్చండి

» ఎస్పీ స్థాయి అధికారితో విచారణ రెండునెలల్లో పూర్తి చేయాలి

» హైకోర్టు ధర్మాసనం కీలక ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న రెడ్డిగౌతమ్, లోచని దంపతులకు సంబంధించి 2019లో దాఖలైన హెబియస్ కార్పస్ పిటిషన్‌లో హైకోర్టు ధర్మాసనం కీలక ఉత్తర్వులు ఇచ్చింది. అక్రమ నిర్బంధం ఘటనకు సంబంధించి ఐవో/అసిస్టెంట్ పోలీస్ కమిషనర్(విశాఖపట్నం, ద్వారక సబ్ డివిజన్)ఆర్‌వీఎస్ఎన్ మూర్తి 2021 డిసెంబర్ 2న ఇచ్చిన నివేదికను రద్దు చేసింది. దంపతుల అరెస్ట్ వ్యవహారాన్ని ఎస్పీ ర్యాంక్ తగ్గని అధికారితో తాజాగా విచారణ జరిపి, రెండునెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది. రెడ్డిగౌతమ్, లోచని దంపతులను 2019అక్టోబరు 28న అరెస్ట్ చేశారా? లేక నవంబర్ 1న అరెస్ట్ చేశారా? అనే విషయాన్ని తేల్చాలంది. అలాగే దర్యాప్తు అధికారి అక్టోబర్ 28న విజయవాడ-విశాఖ మధ్య రెడ్డి గౌతం అద్దెకు తీసుకున్న ప్రైవేటు వాహనంలో ప్రయాణించారా? లేదా? అనే విషయాన్ని కూడా తేల్చాలంది. గౌతమ్ దంపతులను నవంబర్ 1న అరెస్ట్ చేశామని దర్యాప్తు అధికారి చెబుతున్నారని, వారి అరెస్ట్ గురించి అక్టోబర్ 30న పత్రికల్లో వార్తలు ప్రచురించారని గుర్తు చేసింది. విచారణలో ఈ విషయాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. నివేదిక అందిన అనంతరం చట్టనిబంధనలు ఉల్లంఘించిన పోలీస్ అధికారుల విషయంలో తాజాగా ఉత్తర్వులు జారీ చేయాలని విశాఖపోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. విచారణాధికారి నివేదిక, పోలీస్ కమిషనర్ చర్యలపై అభ్యంతరం ఉంటే వాటిని హైకోర్టులో సవాల్ చేసేందుకు రెడ్డిగౌతమ్, లోచని, రెడ్డి గోవిందరావులకు స్వేచ్ఛనిచ్చింది. హెబియస్ కార్పస్ పిటిషన్‌లో న్యాయవాది ఇస్మాయిల్ ఇంటికి వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేసిన వ్యవహారంలో విజయవాడ సైబర్‌సెల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శివాజీపై విజయవాడ పోలీస్ కమిషనర్ ఈ ఏడాది ఏప్రిల్ 15న జారీచేసిన క్రమశిక్షణ చర్యల ఉత్తర్వులపై అసంతృప్తి వ్యక్తంచేస్తూ వాటిని రద్దు చేసింది. ఎస్ఐ ఫాతిమా సీఐ శివాజీ పర్యవేక్షణలో పనిచేశారనే విషయాన్ని పరిగణనలోకి తీసుకొని క్రమశిక్షణ విషయంలో తాజాగా నిర్ణయం తీసుకోవాలని పోలీస్ కమిషనర్‌కు సూచించింది. కోర్టుఉత్తర్వులు అందినరెండు వారాల్లో తాజా ఉత్తర్వులు జారీచేయాలని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది.

తన కుమారుడు రెడ్డిగౌతమ్, కోడలు ఇ.లోచనిలను విజయవాడ, ఆర్టీసీ కాలనీలోని తమ ఇంటి వద్దనుంచి గుర్తుతెలియని వాహనంలో 2019 అక్టోబర్ 28న విశాఖ 4వ పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు తీసుకెళ్లి అక్రమంగా నిర్బంధించారని, వారిని విడుదల చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రెడ్డి గోవిందరావు 2019 అక్టోబర్ 31న హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే వాజ్యం విచారణ సందర్భంగా రెడ్డి గౌతమ్, లోచనిలను 2019 నవంబర్ 1న విశాఖలోని చోడవరం వద్ద అరెస్ట్ చేసినట్లు పోలీసులు కోర్టుకు నివేదించారు. వ్యాజ్యాన్ని ఉపసంహరించుకోవాలని విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్, రైటర్ తమ న్యాయవాది ఇస్మాయిల్ పై ఒత్తిడి చేశారని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. నవంబర్ 7న విజయవాడ పోలీసులు తన నివాసంలోకి అక్రమంగా ప్రవేశించి సోదాలు చేశారని, తన స్టేట్‌మెంట్ నమోదు చేశారని న్యాయవాది ఇస్మాయిల్ అఫిడవిట్ దాఖలు చేశారు. పరస్పర భిన్నవాదనలు, విరుద్ధ ఆరోపణలు నేపథ్యంలో ఈ మొత్తం వ్యవహారం పై విచారణ జరిపి నివేదిక సమర్పించేందుకు సీనియర్ సివిల్ జడ్జిని నియామించాలని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తిని ధర్మాసనం ఆదేశించింది. ఘటన పై విచారణ జరిపిన విశాఖ ఏడవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి 2021 జనవరి 12న నివేదిక సమర్పించారు. సెల్ టవర్ సిగ్నల్‌ను పరిశీలిస్తే దర్యాప్తు అధికారి ఎస్.బాబు, హెడ్ కానిస్టేబుల్ బి.రమణ 2019అక్టోబర్ 28న విజయవాడ నుండి విశాఖకు ప్రైవేటు కారులో ప్రయాణం చేసినట్లు స్పష్టమౌతుందని నివేదికలో పేర్కొన్నారు. అయితే కారులో రెడ్డి గౌతమ్, లోచనిలు ప్రయాణించారా?లేదా అనేది స్పష్టత ఇవ్వలేదు. అడ్వొకేట్ ఇస్మాయిల్ ఇంటికి విజయవాడ పోలీసులు వెళ్లి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది వాస్తవమేనని నిర్ధారించారు. ఈ నివేదికను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం అక్రమ నిర్బంధం ఘటనకు సంబంధించి ఐవో/అసిస్టెంట్ పోలీస్ కమిషనర్(విశాఖపట్నం, ద్వారక సబ్ డివిజన్)ఆర్‌వీఎస్ఎన్ మూర్తి 2021 డిసెంబర్ 2న ఇచ్చిన నివేదికను రద్దు చేసింది. దంపతుల అరెస్ట్ వ్యవహారాన్ని ఎస్పీ ర్యాంక్ తగ్గని అధికారితో తాజాగా విచారణ జరపాలని , రెండునెలల్లో నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

కంచికచర్లరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీ కొనడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన మండల కేంద్రమైన కంచికచర్ల బైపాస్‌లో చోటుచేసుకుంది. కంచికచర్ల ఎస్ఐ విశనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం కంచికచర్ల శివసాయి క్షేత్రం వద్ద 65వ నెంబర్ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న కంచికచర్లకు చెందిన కూరపాటి సరస్వతి (65)ని విజయవాడ వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ప్రమాదంలో తలకు బలమైన గాయాలతో సరస్వతి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం రేపు

జగ్గయ్యపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం మార్గదర్శకాలను ప్రకటించిందని, వ్యవసాయ సబ్ డివిజన్‌లో 22 ధాన్యం కొనుగోలు కేంద్రాలను 17న ప్రారంభిస్తున్నట్టు జగ్గయ్యపేట ఏడీఏ దుర్గాభవాని చెప్పారు. మార్గదర్శకాలపై రైతు సేవా కేంద్రాల ప్రతినిధులకు, సొసైటీ సెక్రటరీలకు బుధవారం తన కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఏ గ్రేడ్ రకం ధాన్యానికి రూ.2389లు, సాధారణ రకాలకు రూ.2369లు మద్దతు ధర ప్రకటించిందని, రైతులు పంట కోత తేది, వేసిన ధాన్యం రకాన్ని, విక్రయించాల్సిన పరిమాణం షెడ్యూల్ సిద్ధం చేసుకునేలా అవగాహన కల్పించి రైతు సేవా కేంద్రాలలో నమోదు చేసుకోవాలని, లేదా నేరుగా వాట్సప్ 9552300009 నెంబర్ ద్వారా షెడ్యూల్ తెలియజేయవచ్చని చెప్పారు. షెడ్యూలింగ్ అయిన తర్వాతనే సంచులు వస్తాయని, సంచులు, హమాలి ఖర్చులు, రవాణా ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ట్రక్ షీట్ వచ్చాక ఆన్‌లైన్ పద్ధతిలో రైతులు ధాన్యం తీసుకుని మిల్లుకు వెళ్లాల్సి ఉంటుందని, రైతులు తమ వాహనానికి జీపీఎస్ తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు.

పత్తికి మద్దతు ధర ప్రకటించాలి

నందిగామ రూరల్ : పత్తికి క్వింటాకు రూ.10వేలు మద్దతు ధర ప్రకటించి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్నీడి యలమందరావు పేర్కొన్నారు. మండ లంలోని మాగల్లు, జొన్నలగడ్డ, పల్లగిరి, రామి రెడ్డిపల్లి గ్రామాల్లోని పత్తి పంటను వామపక్ష పార్టీల, రైతు సంఘ నాయకులు బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అతివృష్టి వల్ల పత్తి పంట దెబ్బ తినటంతో రైతు నష్ట పోతున్నారన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా క్వింటా రూ. 10వేలధరకు పత్తిని కొనుగోలు చేయాలని కోరారు.

పత్తి రైతులను ఆదుకోవాలి : తన్నీరు

జగ్గయ్యపేట నియోజకవర్గంలో 20వేల ఎకరాల్లో పత్తి సాగుచేసిన రైతుల గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడు తున్నారని పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి కనీస మద్దతు ధర రూ.8110లకు కొనుగోలు చేయాలని మాజీ కేడీసీసీ బ్యాంకు చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.

లెక్కలేనంత లిక్కర్

(7వ పేజీ తరువాయి)

ద్వారా ఇక్కడికి తీసుకొచ్చాడు. ఇంతకుముందు ఏఎన్ఆర్ బార్ ఏర్పాటుచేసిన స్థలంలో బాటిలింగ్ చేయించాడు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు లాభం వేసుకుని అమ్ముకున్నాడు. తెలంగాణ, ఏపీలో మద్యం ధరల్లో వ్యత్యాసం ఎక్కువగా ఉండటంతో అప్పట్లో తెలంగాణ నుంచి మద్యం ఎక్కువగా ఇక్కడికి వచ్చేది. వైసీపీ ప్రభుత్వం ఎక్సైజ్ శాఖను ముక్కలు చేసి ఎస్ఈబీని ఏర్పాటు చేశాక అక్రమార్కులపై నిఘా లేకుండాపోయింది. దీన్నే జనార్దనరావు క్యాష్ చేసుకున్నాడు.

ఆదాయ మార్గంగా..

నకిలీ మద్యం తయారీ తక్కువ ఖర్చుతో జరుగుతుండటంతో జనార్దనరావు దాన్నే ప్రధాన ఆదాయ మార్గంగా మార్చుకున్నాడు. ఒక సీసా నకిలీ మద్యం తయారీకి రూ.20 ఖర్చవుతుంది. దాన్ని రూ.99కు విక్రయించాడు. ఒక సీసాపై రూ.79 ఆదాయాన్ని రుచి మరిగాడు. ఐదేళ్ల పాటు ఇలా చేయడంతో డబ్బు దండిగానే సంపాదించాడు. రాజకీయ నేతలకు ఇవ్వాల్సిన వాటాలను పార్టీలకతీతంగా పంపిణీ చేశాడు. వైసీపీ హయాంలో రూ.150గా ఉన్న చీప్ లిక్కర్‌ను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.99కు తగ్గించింది. దీన్ని కూడా జనార్దనరావు అవకాశంగా మార్చుకున్నాడు. కాగా, కొద్దినెలల నుంచి కూటమి ప్రభుత్వం చీప్ లిక్కర్ సరఫరాను తగ్గించింది. ఇది జనార్దనరావుకు మంచి ఆదాయమార్గంగా మారింది. ఇబ్రహీంపట్నంలో తయారుచేసిన నకిలీ మద్యాన్ని మొత్తం బెల్టు షాపులకు సరఫరా చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయాన్ని ఎక్సైజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పలుచోట్ల చాటుమాటుగా బెల్టుషాపులు నడుస్తున్నాయి. వాటికి రెండు మూడు కేసుల చొప్పున నకిలీ మద్యాన్ని పంపిణీ చేసినట్టు అనుమానిస్తున్నారు.

ఆ ఇద్దరి సహకారంతోనే బార్

బార్‌ల కేటాయింపునకు సంబంధించి ఎక్సైజ్ శాఖ సెప్టెంబరులో నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ మొదటి నోటిఫికేషన్‌లో గీత కులాల కేటగిరీలో బార్‌ను దక్కించుకోవాలని జనార్దన్ చూశాడు. మాజీమంత్రి జోగి రమేశ్‌కు చెందిన బంధువును తెర ముందు ఉంచి దరఖాస్తు చేశాడు. ఈ ప్రయత్నం ఫలించకపోవడంతో ఈనెలలో విడుదల చేసిన రెండో నోటిఫికేషన్‌లో బార్ దక్కించుకున్నాడు. ఏఎన్ఆర్ బార్‌ను జనార్దనరావు జనావాసాల మధ్య ఏర్పాటు చేశాడు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. జోగి రమేశ్‌తో పాటు టీడీపీకి చెందిన ఒక నాయకుడు స్థానికులను బెదిరించి మరీ బార్‌ను అక్కడ పెట్టించినట్టు విమర్శలు ఉన్నాయి. ఈ బార్‌ను అక్కడి నుంచి తొలగించి మరోచోట ఏర్పాటు చేయించాలని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌కు లేఖ రాశారు.

ఆక్వా సాగు వివరాల నమోదు తప్పనిసరి

(7వ పేజీ తరువాయి)

సౌత్ కొరియా, ఆస్ట్రేలియా, మిడిల్ ఈస్ట్‌లకు ఎగుమతి చేసేందుకు ఎంపెడా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో జాయింట్ డైరెక్టర్ ఏ.నాగరాజా తదితరులు మాట్లాడారు. కాగా సాంకేతిక ఇబ్బందుల వల్ల ఆశించినంతగా ఆక్వా సాగు నమోదు కావడం లేదని, సాగర మిత్రలు, ఎఫ్‌డీవోలు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సాఫ్ట్‌వేర్‌లోని ఇబ్బందులను సరిచేసి వేగవంతంగా నమోదు చేసేందుకు కృషి చేస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు.

స్వచ్ఛ విజయవాడ స్వచ్ఛ సంకల్పం

ముందు



తర్వాత



స్వచ్ఛ విజయవాడలో భాగంగా గోడలపై వివిధ చిత్రాలతో విద్యార్థులకు అవగాహన

స్వచ్ఛ విజయవాడలో భాగంగా బుధవారం జమ్మి చెట్టు, మొగల్రాజపురంలో ఉన్న వీఎంసీ ప్రత్యేక మోడల్ ప్రాథమిక పాఠశాల గోడలపై 'మొక్కలు నాటడం, రెడ్యూస్ రీయూస్, రీసైకిల్, నీటిని, విద్యుత్‌ను వృథా చేయకూడదు..' అని విద్యార్థులకు అవగాహన కల్పించే చిత్రాలను సుందరంగా తీర్చిద్దారు. పాఠశాల బయట ఉన్న ప్రదేశంలో మొక్కలను నాటి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని రూపొందించారు. ప్రతి పాఠశాలలో ఈ విధంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ గోడలతోపాటు పరిసరాలలో మొక్కలు నాటడం వలన 'స్వచ్ఛ ఆంధ్ర'పై అవగాహన కలుగుతుందన్నారు.

- కార్పొరేషన్

ముందు



తర్వాత





3 లక్షల ఇళ్లకు త్వరలోనే ప్రారంభోత్సవం

» హౌసింగ్ ఎండీ అరుణ్‌బాబు వెల్లడి

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేదలందరికీ అన్ని సౌకర్యాలతో కూడిన పక్కా గృహాలు నిర్మించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలగా ఉన్నారని, ఆయన ఆశయానికి అనుగుణంగా మూడు లక్షల గృహాలను పూర్తి చేసి, త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేయిస్తామని రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ కొత్త ఎండీ పి.అరుణ్‌బాబు చెప్పారు. బుధవారం ఆయన విజయవాడలోని హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సంస్థలోని వివిధ విభాగాల అధికారులతో సమావేశమై పేదల ఇళ్ల నిర్మాణంలో పురోగతిపై సమీక్షించారు. కార్పొరేషన్ చీఫ్ ఇంజనీర్ జయరామాచారి, సీజీఎం అన్నపూర్ణ, జనరల్ మేనేజర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తల సమస్యలు పరిష్కరిస్తా: శుభం బన్సల్

అమరావతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : పారిశ్రామికవేత్తల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తానని రాష్ట్ర పరిశ్రమలశాఖ నూతన డైరెక్టర్ శుభం బన్సల్ హామీ ఇచ్చారు. బుధవారం మంగళగిరిలోని ఏపీఐఐసీ భవన్‌లో ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కొత్తగా నెలకొల్పే పరిశ్రమలకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేసి పారిశ్రామిక పురోగతికి బాటలు వేస్తానని చెప్పారు.

మెట్రో భూ సేకరణకు అడుగులు

(7వ పేజీ తరువాయి)

గుర్తించారు. కృష్ణాజిల్లాలో మెట్రో స్టేషన్ల నిర్మాణానికి పెనమలూరు సెంటర్ నుంచి కానూరు వరకు, గన్నవరం నుంచి నిడమానూరు జంక్షన్ వరకు 5 ఎకరాలు, ప్రధానమైన కోచ్ డిపోకు 56 ఎకరాలు గుర్తించారు. కోచ్ డిపో కోసం కేసరపల్లి దగ్గర ప్రభుత్వ భూములను చూశారు. కాగా, ఈ నెల 24 నాటికి ఏపీఎంఆర్సీ అధికారులు కూడా మెట్రో టెండర్లను ఓపెన్ చేసి ఖరారు చేయనున్నారు. కాంట్రాక్టు సంస్థలు ఖరారుచేసి పనులు చేపట్టే సమాయానికల్లా భూములు కూడా అందుబాటులో ఉండాలి కాబట్టి.. ఈ నెలాఖరులోపే భూ సేకరణ నోటిఫికేషన్ జారీచేసి రెండు నెలల్లో అప్పగించేందుకు చకచకా పావులు కదులుతున్నాయి. ఈలోపు టెండర్లు ఖరారు చేసినప్పటికీ కాంట్రాక్టు సంస్థ మరో మూడు నెలల పాటు కొన్ని కీలక సర్వేలు నిర్వహించాకే పనులు చేపట్టాల్సి ఉంటుంది.

'ధన'కార్యాలు!

(7వ పేజీ తరువాయి)

ఇచ్చారు. కొన్ని ఆస్పత్రులను రెన్యువల్ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. కొంత కాలం తర్వాత ఈ ఆస్పత్రులకు అనుమతులు ఎవరు ఇచ్చారు? డీఎంఅండ్‌హెచ్‌వోకు తెలియకుండా ఈ ఫైళ్లపై డీఎంఅండ్‌హెచ్‌వో సంతకాలు ఎవరు చేశారనే అంశంపై కార్యాలయ అధికారులు ఆరా తీశారు. దీంతో ఆస్పత్రులకు అనుమతులు ఇస్తూ డీఎంఅండ్‌హెచ్‌వో సంతకాలను సైతం ఫోర్జరీ చేశారని అధికారుల విచారణలో తేలింది. దీంతో సదరు మహిళా అధికారిని బాధ్యతల నుంచి తప్పించి, రెండు నెలల పాటు ఖాళీగా కూర్చోబెట్టి జీతాలు చెల్లిస్తున్నారు. దీంతో రోజూ ఆమె కార్యాలయానికి వచ్చి, తనకు బాధ్యతలు అప్పగించాలని అధికారులతో, సంబంధిత విభాగం సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నట్టు తెలిసింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

శంకరబాబుకు టీడీపీ నేతల అభినందన

కానూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దుర్గగుడి ధర్మకర్తల మండలి సభ్యుడిగా నియమితులైన వెలగపూడి శంకర బాబును బుధవారం కానూరులోని ఆయన గృహంలో పలువురు టీడీపీ నేతలు కలిసి అభినందించారు. కంకిపాడు గ్రామ పార్టీ అధ్యక్షుడు నాగేశ్వరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సత్తార్ తదితరులు శంకరబాబును అభినందించిన వారిలో ఉన్నారు.



శంకరబాబును సత్కరిస్తున్న టీడీపీ నేతలు

అభివృద్ధి పనులు పూర్తిచేయాలి

జిల్లా అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని 84 గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు జిల్లా అధికారులకు సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి పనులపై బుధవారం కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయని, వాటిని కలెక్టర్ వేసిన పర్యవేక్షణ కమిటీ పరిరక్షించాలన్నారు. గోకులం పనులకు సంబంధించి 414 దరఖాస్తులు అందితే 157 మాత్రమే మంజూరయ్యాయని మిగిలిన దరఖాస్తులు పరిశీలించాలన్నారు. ఇటీవల వర్షాలకు నియోజకవర్గంలో కొన్ని రహదారులు దెబ్బతిన్నాయని వాటిని తనిఖీ చేసి అంచనాలు సిద్ధం చేయాలని, అంటువ్యాధులు ప్రబలకుండ క్రమంతప్పకుండా మురికి కాలువలను పరిశుభ్రం చేయాలని సూచించారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, జిల్లాలో యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఎలాంటి కొరత లేదన్నారు. విత్తనాల సమస్యలేదని ఉంగుటూరు, బాపులపాడు మండలాల్లో డ్రోన్ల శిక్షణ తీసుకున్న రైతులకు ఉద్యోగాలు వచ్చి వెళ్లిపోవడంతో డ్రోన్లు సరఫరా చేయలేదని అవసరమైన వారికి శిక్షణ ఇచ్చి డ్రోన్లు సరఫరా చేస్తామన్నారు. ఈ ఏడాది 30 ఎకరాల్లో వెదురు బొంగుల పంట ప్రోత్సహించాల్సి ఉండగా సరైన మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో రైతులు ముందుకు రావడం లేదని ఉద్యాన శాఖ జిల్లా అధికారి జ్యోతి తెలిపారు. ఈ సమావేశంలో గుడివాడ ఆర్డీవో జి బాలసుబ్రమణ్యం, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, గన్నవరం ఏఎంసీ చైర్మన్ గూడవల్లి నరసింహారావు, జిల్లా పశు సంవర్ధక అధికారి చిన్న నరసింహులు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఎస్ఈ సోమశేఖర్, ఆర్ అండ్ బీ ఈఈ లోకేశ్వరరావు, గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ పద్మావతి, సర్వే భూ రికార్డుల ఏడి జోషిలా, మార్కెటింగ్ ఏడీ విద్యానందం, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ మురళీ కిషోర్ తదితర జిల్లా అధికారులు, తహసీల్దారు కేవీ శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. బుధవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆధ్వర్యంలో గంగూరులో స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో వీధుల వెంట ప్రజలు వినియోగించి పడవేసిన వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రజల సహకారంతో స్వచ్ఛ రథాల ద్వారా ప్రభుత్వమే సేకరించి దానికి బదులుగా ప్రతి రోజూ ఉపయోగపడే నిత్యావసరాలను అందించే ఆలోచన చేయడం కూటమి ప్రభుత్వ అధినేతలు ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల ముందు చూపునకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

పేదలకు సంజీవని సీఎం సహాయనిధి

ముఖ్యమంత్రి సహాయనిధి బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంజీవని లాంటిదని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ వ్యాఖ్యానించారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 22మందికి 11.85లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీ పత్రాలను అందించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఆసుపత్రి ఖర్చులు కూడా పెట్టుకోలేని పేదలకు ఈ పథకం వల్ల మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్‌ప్రసాద్, చెన్నుపాటి శ్రీనివాసరావు, సంగెపు రంగారావు, తాతపూడి గణేష్, యేకుల విజయేంద్ర, గోపీచంద్, దోనేపూడి రవికిరణ్, ఇబ్రహీం పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటరు ఏర్పాటుపై హర్షం

ఇటీవల ప్రధాని మోదీ సమక్షంలో జరిగిన విశాఖపట్నం గూగుల్ డేటా సెంటరు ఒప్పందంపై ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ కూటమి నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు ప్రజల చరిత్రలో గూగుల్ డేటా సెంటరు ఏర్పాటును సువర్ణాధ్యాయంగా అభివర్ణించారు. హైదరాబాద్ విశ్వనగరంగా అభివృద్ధి చెందడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధాన కారణమని పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ ఒప్పుకుంటారని, అప్పట్లోనే బండరాళ్లు, గుట్టలు, పిచ్చిమొక్కలు ఉన్న గచ్చిబౌలి, మాదాపూర్ లాంటి ప్రాంతాలను ఎంపిక చేసుకొని బిల్‌గేట్స్‌ను రాష్ట్రానికి రప్పించి హైటెక్ సిటీని నిర్మించి మైక్రోసాఫ్ట్ లాంటి కంపెనీల ఏర్పాటుకు కృషి చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. అదేవిధంగా విశాఖపట్నానికి ప్రపంచంలోనే పేరున్న గూగుల్ డేటా సెంటరును రప్పించడంలో ఐటీ మంత్రి లోకేశ్ పాత్ర ఎంతయినా ఉందన్నారు. మంత్రి లోకేశ్ రాష్ట్రానికి భవిష్యత్ ఆశాకిరణమన్నారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్ సిటీ, విశాకలో లులు మాల్ లాంటి దిగ్గజ కంపెనీలను ఏర్పాటు చేయడంలో లోకేశ్ పాత్ర శ్లాఘనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నేతలు పాల్గొన్నారు.

పెరికీడు-2 డ్రెయిన్ మరమ్మతులు చేపట్టాలి



హనుమాన్‌జంక్షన్‌రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : కాకులపాడు డిస్ట్రిబ్యూటరీ పరిధిలోని పెరికీడు-2 డ్రెయిన్ చెత్తతో పూడుకుపోవడం వల్ల వివిధ గ్రామాల్లో పంటనష్టంతో పాటు లోతట్టు ప్రాంతాలు కూడా ముంపునకు గురవుతున్నాయని త్వరితగతిన పూడిక తీతపనులు చేయించాలని కోరుతూ డీసీ చైర్మన్ కొమ్మారెడ్డి రాజేష్ వినతిపత్రం అందజేశారు. కాకులపాడు డీసీ చైర్మన్, ఎన్ ఎస్ఎల్సీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణతో కలిసి బుధవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ద్వారా కలెక్టర్ బాలాజీకి వినతిపత్రం అందజేశారు.

యువత భవిష్యత్తుకు ఐటీ మంత్రి లోకేశ్ కృషి

హనుమాన్‌జంక్షన్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : రాష్ట్ర భవిష్యత్తును మలుపుతిప్పే అతిపెద్ద ప్రాజెక్ట్ గుగూల్ ఏఐ హబ్ ఏర్పాటుకు ఐటీ మంత్రి లోకేశ్ కృషి అభినందనీయమని తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కల్యాణి అన్నారు. హనుమాన్‌జంక్షన్‌లోని స్వగృహంలో బుధవారం మాట్లాడుతూ, భావితరాల భవిష్య త్తును మార్చడంతో పాటు రాష్ట్ర రూపురేఖలను మార్చేందుకు ఐటీ మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి ఫలించిందన్నారు. కోట్లాది రూపాయల పెట్టుబడితో దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్ట్ అయిన ఏఐ డేటా సెంటర్ రాష్ట్రానికి రావడం చారిత్రాత్మకమన్నారు. రాష్ట్రంలోని యువత కోసం విస్తృతస్థాయిలో కృషి చేస్తూ ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాల కల్పనతో వ్యాపార అనుకూల విధానాలను అమలు చేయడం సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌కు సాధ్యమయిందన్నారు.

దాతల సహకారంతో ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి



ఉయ్యూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : సంస్థలు, దాతల సహకారంతో వైద్య శాలకు అవసరమైన పరికరాలు ఏర్పాటు చేస్తున్నామని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మండవ జయదేవ్ అన్నారు. వైద్యశాల అవరణలో బుధవారం ఏర్పాటు చేసిన అభివృద్ధి కమిటీ సమావేశంలో జయదేవ్ మాట్లాడుతూ, ఐడీబీఐ సహకారంతో వైద్యశాలకు అవసరమైన రూ. 5లక్షలతో జనరేటర్, షెడ్డు, శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల యాజమాన్యం సహకారంతో లక్షా ఏభైవేల రూపాయలతో విశ్రాంతి షెడ్డు సమకూరాయన్నారు. ఎంపీడీవో శేషగిరిరావు, అడ్వయిజరీ కమిటీ సభ్యులు వినయ్‌కుమార్, మాణిక్యమ్మ, కన్వీనర్ స్వరూప పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలి

కంకిపాడు క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు

కంకిపాడు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌పై వైసీపీ నాయకులు ఇష్టానుసారం మాట్లాడితే సహించేది లేదని కంకిపాడు క్లస్టర్ కో కన్వీనర్ పులి శ్రీనివాసరావు హెచ్చరించారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ, ఎమ్మెల్యే నియోజకవర్గంలో నిత్యం అందుబాటులో ఉంటూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గం అభివృద్ధికి వందల కోట్ల రూపాయలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఐదేళ్ల వైసీపీ హయాంలో నియోజకవర్గంలో ఒక్క రోడ్డునైనా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వైసీపీ ప్రభుత్వం ప్రజల చేత ఛీత్కరించబడిందన్నారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు కొండా నాగేశ్వరరావు, చిట్టూరి నాగేశ్వరరావు, ఏనుగ జయప్రకాష్, పచ్చిపాల రాజ తదితరులు పాల్గొన్నారు.



కానుమోలులో ధాన్యం కొనుగోలులో తేమశాతం పరీక్షల గురించి వివరిస్తున్న జిల్లా సివిల్‌సప్లైస్ సిబ్బంది చిన్నారి, లేఖశ్రీ.. ఉంగుటూరులో..

నాణ్యతా ప్రమాణాలతో ధాన్యం సేకరణ జరగాలి

హనుమాన్‌జంక్షన్/ హనుమాన్‌జంక్షన్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా నాణ్యత ప్రమాణా లతో నిర్వహించాలని బాపులపాడు మండల వ్యవసా యాధికారి రంగనాథబాబు రైతు సేవా కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మండలంలో 15 రైతు సేవా కేంద్రాలు ద్వారా నిర్వహించనున్న ధాన్యం సేకరణ నిర్వహణ, అనుసరించాల్సిన విధానాలపై రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందికి బుధవారం బాపులపాడు మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయాధికారి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల సొసైటీ కార్యదర్శులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని వ్యవసా యశాఖ అధికారి రంగనాథ్‌బాబు సూచించారు. కానుమోలు పీఏసీఎస్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం జిల్లా సివిల్‌సప్లైస్ సాంకేతిక సిబ్బంది చిన్నారి, లేఖశ్రీలతో కలిసి పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేసే టప్పుడు తీసుకోవలసిన నియమావళిపై పీఏసీఎస్ సీఈవో, వీఏఏ, టెక్నికల్ సిబ్బందికి సోదాహరణంగా వివరించారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరించాలి

ఉంగుటూరు : ధాన్యం మొత్తాన్ని రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేకరించాలని ఏవో గద్దె రమేష్ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సూచించారు. ధాన్యం సేకరణకు మండలంలో 12 ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన నేపథ్యంలో బుధవారం సంబంధిత సిబ్బందికి ఉంగుటూరు రైతుసేవా కేంద్రంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో బి.దుర్గానాగేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్లు భవితవ్య, ప్రీతి, వీఏఏలు, కస్టోడియన్ అధికారులు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు పాల్గొన్నారు.

శాస్త్ర సాంకేతిక రంగాల్లో కలాం సేవలు మరువలేనివి

భారతీనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : భారతదేశ శాస్త్ర సాంకేతిక రంగాల్లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బుధవారం షన్ టైం క్లబ్ రోడ్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్ : విద్య, శాస్త్రసాంకేతిక రంగాల్లో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అందించిన సేవలు యువతకు శిరోధార్యమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. మానవత సభ్యులు వేగిరెడ్డి సూర్యనారాయణ, వెంకటస్వామి, రామచంద్రరావు, జేవీవీ సత్యనారాయణ, పీవీఎస్ చలం, సుబ్బాచారి పాల్గొన్నారు.

గన్నవరం : ఆదర్శనీయుడు అబ్దుల్ కలాం అని లైబ్రేరియన్ కంచాల నాగరాజు అన్నారు. స్థానిక గ్రేడ్-1 గ్రంథాలయంలో భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు.

బాణసంచా స్వాధీనం

పెనమలూరు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : తాడిగడప డొంకరోడ్డులోని ఒక గోడౌన్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను పెనమలూరు పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. బాణసంచా విలువ షుమారు రూ. లక్ష ఉంటుందని పోలీసులు తెలిపారు. సరైన అనుమతులు లేకుండా అక్రమంగా బాణసంచాను నిల్వ ఉంచేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటరమణ హెచ్చరించారు.



ఐసీడీఎస్ కార్యాలయానికి వాటర్ కూలర్ అందజేస్తున్న యలమంచిలి కిషోర్‌బాబు

వాటర్ కూలర్ అందజేత

కంకిపాడు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): ఐసీడీఎస్ కార్యాలయానికి అవసరమైన వాటర్ కూలర్‌ను దాతలు అందించడం అభినందనీయమని సీడీపీవో సుకన్య అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయానికి అవసరమైన వాటర్ కూలర్‌ను తెలుగుదేశం పార్టీ నాయకులు, సామాజిక కార్యకర్త యలమంచిలి కిషోర్‌బాబు బుధవారం అందజేరు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అన్నామణి, రాఘవమ్మ, విజయలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు నళినికుమారి, భవాని దుర్గ, లక్ష్మి, రాజ్యలక్ష్మి, శారద, మీన పాల్గొన్నారు.



వీరమ్మతల్లి ఆలయ రోడ్డులో గుంతలు పూడుస్తున్న కూలీలు

గుంతలు పూడ్చివేత

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

ఉయ్యూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మతల్లి ఇంటి రోడ్డులో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి తీసిన గుంతలు ఎట్టకేలకు పూడ్చారు. ఈ రోడ్డులో ఇరువైపులా సీసీ డ్రెయిన్ నిర్మాణం కోసం గుంతలు తవ్వి మట్టిని వేరేచోటికి తరలించారు. డ్రెయిన్ నిర్మాణం పూర్తయి మూడు వారాలు పూర్తయినా పక్కన ఉన్న గుంతల్లో మెటల్‌తో పూడ్చకపోవడంతో స్థానికులు ఇళ్లలోకి వెళ్లేందుకు వీలులేక ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో డ్రెయిన్ నిర్మించారు, గుంతలు పూడ్చటం మరిచారు శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు కాంట్రాక్టరుతో గుంతలు పూడ్చిపించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన శొంఠి శివరాంప్రసాద్

కూటమి ప్రభుత్వంలో యువతకు ఉపాధి

పెనమలూరు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : కూటమి ప్రభుత్వంలో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పిస్తుందని రాష్ట్ర గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరాంప్రసాద్ అన్నారు. గూగుల్ సంస్థ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులను తీసుకురావడంలో లోకేశ్ కృషి అభినందనీయమన్నారు. రాష్ట్ర చరిత్రను తిరగరాస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబును, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను ఉండవల్లిలోని నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

గన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని గొల్లనపల్లిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని గ్రామ ఉప సర్పంచ్ యనమదల సుబ్బారావు కలెక్టర్ డీకే బాలాజీకి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. గన్నవరంలో కలెక్టర్‌ను కలసి గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, తాగునీటి ట్యాంకు శిథిలావస్థకు చేరిందని, శ్మశానవాటికకు వెళ్లే మార్గం అధ్వానంగా ఉందని కలెక్టర్ డీకే బాలాజీకి వివరించారు. శ్మశానానికి వెళ్లే రహదారి నిర్మాణం వెంటనే చేపట్టాలని కోరారు. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో సీమంతాలు

పెనమలూరు, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి) : కంకిపాడు ఐసీడీఎస్ పరిధి యనమలకుదురు సెక్టార్‌లోని పెదపులిపాక, పోరంకిలో బుధవారం పోషణ మాసోత్సవాల్లో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని ప్రదర్శించి గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. పోషకాహారాన్ని లబ్ధిదారులందరూ వినియోగించుకోవాలని, రక్తహీనత, లోపపోషణ నివారించవచ్చని సూపర్‌వైజర్ సులోచనారాణి తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త జయలత తదితరులు పాల్గొన్నారు. సాలిపేటలో హెచ్‌పీ నిర్మలకుమారి, ఏఎన్ఎం సీత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

గన్నవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు చెకుముకి సైన్స్ సంబరాలు దోహదంచేస్తాయని జనవిజ్ఞాన వేదిక జిల్లా సభ్యులు, చెకు ముకి జిల్లా కన్వీనర్ షేక్ ఇమాం తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు పాఠశాల స్థాయిలో ప్రారంభమవుతాయన్నారు. నవంబరు 1న మండలస్థాయి, 23న జిల్లాస్థాయి, డిసెంబరు 12, 13, 14న రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలు జరుగుతాయని తెలిపారు.

కండల కోసం స్టెరాయిడ్స్

విజయవాడ, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి) : కండలు కుండల్లా కనిపించడానికి ఓ యువకుడు స్టెరాయిడ్స్‌ను ఉపయోగిస్తున్నాడు. ఈ విషయం తెలుసుకున్న పటమట పోలీసులు అతడి నుంచి స్టెరాయిడ్ ఇంజక్షన్ సీసాలను స్వాధీనం చేసుకున్నారు. యనమలకుదురు గ్రామానికి చెందిన షేక్ రసూల్ ఫైనాన్స్ కంపెనీలో కలెక్షన్ ఏజెంట్‌గా పని చేస్తున్నాడు. బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనడానికి అతడు గురునానక్ కాలనీలో ఉన్న జిమ్‌లో వ్యాయామానికి వెళ్తున్నాడు. వ్యాయామం చేయడానికి ముందు స్టెరాయిడ్స్ తీసుకుంటున్నాడు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

స్వచ్ఛమైన గాలికోసం కృషిచేద్దాం

- 18న క్లీన్ ఎయిర్ థీమ్‌తో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర
- పర్యావరణహిత దీపావళిని జరుపుకొందాం: కలెక్టర్

కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న స్వచ్ఛమైన గాలి (క్లీన్ ఎయిర్) ఇతివృత్తంతో నిర్వహించనున్న స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర విజయవంతానికి కృషిచేయాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం ఒక ప్రత్యేక థీమ్‌తో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నామయని, ఈనెల మూడో శనివారం క్లీన్ ఎయిర్ థీమ్‌తో నిర్వహించనున్నట్టు తెలిపారు. నిత్య జీవిత ప్రయాణాన్ని పర్యావరణహిత మార్గంలో సాగించేలా అవగాహన కల్పించాలని, హానికర టపాసులు కాకుండా దీపాల కాంతులతో పర్యావరణహిత దీపావళిని జరుపుకుందామని అధికారులు, సిబ్బంది ఇదే బాటలో నడిచి భావితరాలకు స్వచ్ఛమైన గాలి రూపంలో వెలకట్టలేని సంపదను బహుమతిగా అందించడంలో భాగస్వాములవుదామని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. డీపీవో పీ లావణ్యకుమారి పాల్గొన్నారు.



మహిళా పారిశ్రామికవేత్తల సెంట్రల్ జోన్ నూతన కార్యవర్గ ప్రతినిధులు

రాష్ట్ర మహిళా పారిశ్రామికవేత్తల

నూతన కార్యవర్గం ఎన్నిక

విజయవాడ సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ మహిళా పారిశ్రామికవేత్తల విభాగం సెంట్రల్ జోన్ చైర్ పర్సన్‌గా డాక్టర్ మమత రాయపాటి, వైస్ చైర్ పర్సన్‌గా స్రవంతి కంచర్ల, బీ జయశ్రీ బాధ్యతలు తీసుకున్నట్టు ఏపీ చాంబర్స్ అధ్యక్షుడు పొట్లూరి భాస్కరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరితో కమిటీ సభ్యులుగా పెద్ది అనూష, ప్రియాంక, అమృత, రాణి, రూప, సునీత, వెంకట విజయదుర్గ, యామినిచంద్ర, శ్రావణి, డాక్టర్ శరణ్య ఎంపికైనట్టు వివరించారు. వీరు రెండేళ్ల పాటు పదవిలో కొనసాగుతారని, మహిళల్లో వ్యాపార నైపుణ్యాలను పెంచేందుకు ఫ్యాబ్రిక్ పెయింటింగ్, కుట్టుపని, పర్సనల్ బ్రాండింగ్, పర్సనల్ ఫైనాన్స్ తదితర ఎక్స్‌పోలను నిర్వహించాలని ఈ కార్యవర్గం యోచిస్తుందని వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీడీసీఎస్ సీఎండీ పుల్లారెడ్డి

విద్యుత్ కనెక్షన్లు తక్షణమే మంజూరు చేయండి

- ఏపీసీపీడీసీఎస్ సీఎండీ పీ పుల్లారెడ్డి

మాచవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను దరఖాస్తు చేసుకున్న వెంటనే మంజూరు చేయాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారులను ఏపీసీపీడీసీఎస్ సీఎండీ పీ పుల్లారెడ్డి ఆదేశించారు. విద్యుత్ శాఖ కార్యాలయంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం సీఎండీ సమావేశమయ్యారు. వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ కనెక్షన్ల మంజూరులో అలసత్వం వద్దని, పీఎం సూర్యఘర్ పథకాన్ని విస్తృతం చేయాలని, రెవెన్యూ కలెక్షన్ల బకాయిలు లేకుండా చర్యలు తీసుకోవాలని, నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. టెక్నికల్ డైరెక్టర్ మురళీకృష్ణ, ప్రాజెక్ట్ డైరెక్టర్ టీబీ మూర్తి, ఫైనాన్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏషియన్ యూత్ గేమ్స్‌కు శ్రీకాంత్ నామినేట్



విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 30 వరకు బహ్రెయిన్‌లో జరగనున్న 3వ ఏషియన్ యూత్ గేమ్స్‌లో ఆర్గనైజింగ్ కమిటీ టెక్నికల్ అఫిషియల్‌గా యలమంచలి శ్రీకాంత్ నామినేట్ అయ్యారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా ఉన్న శ్రీకాంత్ యూత్ గేమ్స్‌లో టెక్నికల్ అఫిషియల్‌గా ఎంపికవ్వటంపై అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన నేషనల్ బీచ్ కబడ్డీ చాంపియన్‌షిప్ నిర్వహణలో ఆయన అందించిన సహకారం, ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో రాష్ట్ర జట్లు అద్భుతమైన ప్రతిభ చూపడంతో ఏకేఎఫ్ఐ యలమంచలి శ్రీకాంత్ పేరును రికమండ్ చేసింది. టెక్నికల్ అఫిషియల్‌గా ఎన్నికైన శ్రీకాంత్‌ను క్రీడాశాఖ మంత్రి ఎం రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్, శాప్ చైర్మన్ రవినాయుడు, ఏపీ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీ ప్రభావతి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ అర్జునరావు అభినందనలు తెలిపారు.

లంచం కేసులో జీజీహెచ్ ఏడీకి జైలుశిక్ష

విజయవాడ లీగల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంట్ జనరల్ ఆసుపత్రిలో అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా పనిచేసిన టీ శంకరరావుకు 2013లో లంచం తీసుకున్న కేసులో తాజాగా జైలు శిక్ష పడింది. ఆసుపత్రిలో ఏసీ, కూలర్ రిపేర్‌కు సంబంధించి బిల్లులు ప్రాసెస్ చేయడానికి కే వెంకట నాగబాబు అనే మెకానిక్ నుంచి రూ.1,500 లంచంగా డిమాండ్ చేశాడు. ఏసీ మెకానిక్ నాగబాబు ఫిర్యాదు మేరకు డబ్బులు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేసి, విజయవాడ ఏసీబీ ప్రత్యేక కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారించిన ఏసీబీ కోర్టు ఏడీ టీ శంకరరావుకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6 వేలు జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చింది.

ఎన్టీఆర్ వికాస క్యాంపస్ డ్రైవ్

కలెక్టరేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వికాస ఆధ్వర్యంలో ఈనెల 17న శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్టీఆర్ వికాస కార్యాలయంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు ఎన్టీఆర్ వికాస ప్రాజెక్ట్ డైరెక్టర్ కే లచ్చారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ డ్రైవ్‌లో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కంపెనీలో డెస్క్‌టాప్ సపోర్ట్ ఇంజినీర్, డేటా సెంటర్ ఆపరేటర్, సపోర్ట్ ఇంజినీర్, నెట్‌వర్క్ ఇంజినీర్ ఉద్యోగాలకు బీటెక్ (ఆల్ స్ట్రీమ్స్), ఎంసీఏ, బీసీఏ, బీఎస్సీ 2019 నుంచి 2025లో ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఈ ఉద్యోగానికి ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.2 లక్షల నుంచి 2.7 లక్షల వరకు జీతం ఉంటుందని, వివరాలకు 9154557779, 9154667779 నెంబర్లలో సంప్రదించాలన్నారు.



మత్తుతో మేలే..!

- వైద్యరంగంలో కీలకంగా అనస్థీషియా
- నేడు ప్రపంచ అనస్తీషియా దినోత్సవం

అమెరికాలో మసాచిసెట్స్ జనరల్ ఆసుపత్రిలో 20 ఏళ్ల యువకుడికి 1846 అక్టోబరు 16న మెడ వద్ద ఆపరేషన్ చేయాల్సి వచ్చింది. సాధారణంగా ఆపరేషన్ సమయంలో రోగి నొప్పిని భరించలేక ఆసుపత్రి దద్దరిల్లేలా అరుస్తాడు. కానీ ఆపరేషన్ నిర్వహించే డాక్టర్ ఆ రోగితో ఈథర్ వాసన పీల్పింపజేశాడు. దీంతో ఆపరేషన్ సమయంలో ఆ యువకుడు ఎలాంటి నొప్పి కలగకపోవడం ఆపరేషన్ సజావుగా సాగింది. అలా వైద్య రంగంలో అదో మైలురాయి. అప్పటి నుంచి వైద్యరంగం అనస్తీషియాలో మార్పులతో క్రమంగా సర్జరీలు సులభంగా చేసే స్థాయికి ఎదిగింది. అనస్థీషియా అంటే సెన్సేషన్ లేకుండా చేయడమని అర్థం. రోగులకు శస్త్రచికిత్స సమయంలో నొప్పి తెలియకుండా దీన్ని ఇస్తారు. ఒకప్పుడు సర్జరీలు తక్కువగా జరిగేవి. అప్పట్లో అనస్థీషియా అంటే చాలామంది ప్రజలు భయపడిపోయేవారు. ఇప్పటికీ గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అనస్థీషియా అంటే భయపడే పరిస్థితి కొంత వరకు ఉంది. ఇలాంటి వారికి అవగాహన కల్పించేలా ఏటా అక్టోబరు 16న అనస్థీషియా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. నేడు అనస్థీషియా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఆంధ్రజ్యోతి - విజయవాడ

శస్త్రచికిత్స సమయంలో రోగికి నొప్పి తెలియకుండా ఉండడం కోసం అనస్థీషియా ఇస్తారు. దీంతో రోగి కదలకుండా, శస్త్రచికిత్స సమయంలో డాక్టర్లకు సహకరిస్తాడు. అనేకమంది శస్త్రచికిత్స అంటే భయపడతారు. దీంతో మానసికంగా ఒత్తిడికి గురవుతారని వైద్యులు చెబుతున్నారు. ఇలాంటివారికి అనస్థీషియా ఇవ్వడం వల్ల శస్త్రచికిత్స సమయంలో ఏం జరిగిందో తెలియకపోవడంతో తర్వాత ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా ఉంటారు. ముఖ్యంగా సర్జరీ సమయంలో రోగి హృదయ స్పందన, రక్తపోటు, శ్వాస వంటి క్రియలను అనస్థీషియాలజిస్టులు గమనిస్తూ సురక్షితంగా సర్జరీ పూర్తి చేస్తారని నిపుణులు చెబుతున్నారు.

ఏయే సందర్భాల్లో మత్తు ఇస్తారు..?

చిన్నస్థాయి శస్త్రచికిత్స (దంతాలు తీయడం వంటివి)ల నుంచి పెద్దపెద్ద శస్త్రచికిత్సలు (ఉదా: గుండె, మెదడు, కీళ్ల శస్త్రచికిత్స) వరకు అన్ని రకాల శస్త్రచికిత్సల్లో నొప్పి తీవ్రతను బట్టి ట్యాబ్లెట్/ఇంజక్షన్ ఇస్తారు. క్యాన్సర్ వంటి రోగులు తీవ్రమైన నొప్పితో ఉంటారు. అలాంటి వారికి నొప్పి నివారిణిగా (లేబర్ పెయిన్), ప్రసవ సమయంలో ప్రసవ నొప్పిని తగ్గించడానికి (ఎపిడ్యూరల్) వంటి అనస్థీషియా ఇస్తారని వైద్యులు వెల్లడించారు. ఎండోస్కోపీ, కోలోస్కోపీ వంటి పరీక్షల సమయంలో అనస్థీషియా ఇస్తారు. అంటే సమయాన్ని బట్టి అనస్థీషియా మూడు రకాలుగా ఇస్తారు. **లోకల్ అనస్థీషియా..** శరీరంలోని ఒక చిన్న భాగానికి మాత్రమే ఇస్తారు. ఉదా: దంతాలకు చికిత్స చేసినప్పుడు, చిన్న చిన్న దెబ్బలు తగిలినప్పుడు కుట్లు వేయడానికి/శస్త్ర చికిత్స చేసే సమయంలో ఇస్తారు. **రీజనల్ అనస్థీషియా..** శరీరంలోని పెద్ద భాగానికి (కాలు, చేయి విరిగినప్పుడు) ఇస్తారు. ప్రసవ సమయంలో ఇచ్చే ఎపిడ్యూరల్‌నే ఈ సమయంలో ఎక్కువగా వాడుతారు. ఇక **జనరల్ అనస్థీషియా..** దీన్ని ఇవ్వడం వల్ల రోగి పూర్తిగా మత్తులోకి వెళ్తాడు. పెద్ద స్థాయిలో అంటే గుండె, మెదడు, శరీరంలో సున్నితమైన భాగాలకు శస్త్రచికిత్స నిర్వహించినప్పుడు ఇస్తారు. అనస్థీషియాను ఆధునిక వైద్యశాస్త్రంలో ఒక అద్భుత ఆవిష్కరణగా వైద్యులు చెబుతున్నారు. అనస్థీషియా లేకపోతే నేడు నిర్వహించే అనేక రకాల కఠినమైన శస్త్రచికిత్సలు నిర్వహణ సాధ్యమయ్యేది కాదని వైద్యులు చెబుతున్నారు. అనస్థీషియా రోగుల నొప్పి, బాధ నుంచి ఉపశమనం కలిగించి, వైద్యులు శస్త్రచికిత్సను సులభంగా, సురక్షితంగా నిర్వహించడానికి ముఖ్యకారకంగా ఉపయోగపడుతుంది.

ప్రజల్లో అవగాహన కల్పించాలి: డాక్టర్ తారకప్రసాద్



అనస్థీషియాపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలాజిస్ట్ రాష్ట్ర అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఉప్పలేటి తారకప్రసాద్ అన్నారు. నగరంలోని ఒక హోటల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరంలోని అన్ని బ్రాంచీల్లో సీపీఆర్ కార్డియో పల్మనరీ రీసక్సిటేషన్‌పై, సీవోఎల్ఎస్ కంప్రెషన్ ఓన్లీ లైఫ్ సపోర్ట్ మీద ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఆపరేషన్ సమయంలో రోగులు అనస్థీషియా గురించి భయపడుతుంటారని వారి భయాన్ని తొలగించాల్సిన బాధ్యత డాక్టర్స్‌పై ఉందన్నారు. ప్రపంచంలో అన్ని దేశాల్లో నేడు అనస్థీషియా డే జరుపుకుంటారని, ఇక్కడ జరిగే వేడుకలకు డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు, డాక్టర్ భీమేశ్వర్, డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ కుచేలబాబు పాల్గొంటారన్నారు.

జోగిని తక్షణమే అరెస్టు చేయాలి

- ఫేక్ వాట్సాప్ చాటింగ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం: కూటమి నేతలు

ఇబ్రహీంపట్నం/జి.కొండూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కల్తీమద్యం కేసులో ఏ1 ముద్దాయి అద్దెపల్లి జనార్దనరావుతో వాటాట్సాట్సాప్ చాటింగ్‌లో దొరికిన మాజీమంత్రి, వైసీపీ నేత జోగి రమేష్ అదే చాటింగ్‌ను ఏఐ టెక్నాలజీ వాడి మంత్రి లోకేశ్, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, పోసాని కోటేశ్వరరావుతో జనార్దనరావు వాటాట్సాట్సాప్ చాటింగ్ చేసినట్టు సృష్టించి తన అనుచరులతో సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేయిస్తున్న జోగిని తక్షణం అరెస్టు చేయకుంటే ఇలాంటి అనేక ఆగడాలు సృష్టిస్తాడని టీడీపీ నేత, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు ధ్వజమెత్తారు. బుధవారం కొండపల్లి మున్సిపాలిటీ టీడీపీ కార్యాలయంలో ఆయన కూటమి నేతలతో కలిసి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ నేతలపై ఫేక్ వాటాట్సాట్సాప్ చాటింగ్స్‌ను ప్రచారం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని విజయవాడ సీపీకి ఫిర్యాదు చేయనున్నట్టు తెలిపారు. కూటమి నేతలు చుట్టుకుదురు శ్రీనివాసరావు, చనమోలు నారాయణరావు, చెరుకుమల్లి సురేష్, ధరణికోట విజయలక్ష్మి, కొత్తపల్లి ప్రకాష్, భయ్యా రాము, పాల్గొన్నారు.

బీసీ కులానికే కళంకం జోగి

నకిలీ మద్యం కేసులో అడ్డంగా దొరికిపోయి కులం కార్డు వాడుకొని బయటపడే ఎత్తుగడ వేస్తున్న మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేష్ అనే వ్యక్తి బీసీ కులానికే ఒక కళంకం లాంటి వ్యక్తి అని టీడీపీ జి.కొండూరు మండల నేతలు అన్నారు. బుధవారం జి.కొండూరులోని టీడీపీ మండల కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జోగి తీసిన కల్తీ మద్యం గోతిలో అతనే పడ్డారన్నారు. మళ్లీ దొంగే దొంగ అని అరిచినట్టుగా వ్యవహరిస్తున్నాడన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వేములకొండ వెంకటేశ్వరరావు, లంక నాగేశ్వరరావు (నాని), సీనియర్ నేత ఉయ్యూరు వెంకట నరసింహారావు, పంటాపంచల నరసింహారావు, మంచినేని రాజశేఖర్, బొర్రా అశోక్, కాజ బ్రహ్మయ్య, బాధినేని సీతారామరాజు, బూర్సు శివ, గాలి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలీసు కమిషనర్‌కు టీడీపీ నేతల ఫిర్యాదు

విజయవాడ: నకిలీ మద్యం తయారీ కేసులో ప్రధాన సూత్రధారి అద్దేపల్లి జనార్దనరావు మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, మంత్రి లోకేశ్‌తో చాటింగ్ చేసినట్టు స్క్రీన్‌షాట్లను సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీపీ నేతలు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబుకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోసాని కోటేశ్వరరావుతో పాటు మరికొందరు సీపీని కలిశారు. కొంతమంది వ్యక్తులు వారి ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఇలా చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇదే విషయమై మాజీ మంత్రి జోగి రమేష్ పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. జనార్దనరావు వీడియోలో పేర్కొన్నట్టుగా నకిలీ మద్యం తయారీతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తన ప్రతిష్ఠకు భంగం కలిగేలా సామాజిక మాధ్యమాల్లో ట్రోల్స్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.



సీపీ రాజశేఖరబాబుకు ఫిర్యాదు అందిస్తున్న టీడీపీ నేతలు

గొల్లపూడిలో విజిలెన్స్ దాడులు

- రూ.36లక్షల విలువైన విదేశీ సిగిరెట్ల బండిల్స్ స్వాధీనం

విద్యాధరపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విదేశాలకు చెందిన సిగరెట్లు బిల్లులు లేకుండా ఇతర ప్రాంతాల నుంచి పలు ట్రాన్స్‌పోర్టుల్లో అక్రమంగా విజయవాడకు తరలించి ఇక్కడ నుంచి లోకల్ ట్రాన్స్‌పోర్టుల ద్వారా పలు ప్రాంతాలకు రవాణా చేస్తున్న గొల్లపూడి కమర్షియల్ మార్కెట్ ప్రాంగణంలోని లోకల్ ట్రాన్సుపోర్టులపై విజిలెన్స్ అధికారులు దాడి చేసి సుమారు రూ.36 లక్షల విలువైన విదేశీ సిగరెట్ల బండిల్స్‌ను స్వాధీనం చేసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొందరు సిగరెట్ల వ్యాపారులు అనధికారికంగా బిల్లులు లేకుండా ఈ విదేశీ సిగరెట్లను దొంగచాటుగా విజయవాడకు తీసుకువచ్చి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. ఈ సమాచారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులకు తెలిసింది. దీంతో అధికారులు పలు లోకల్ ట్రాన్స్‌పోర్టులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కమర్షియల్ మార్కెట్‌లోని షాపు నెం.42 విజయలక్ష్మి డెయిలీ పార్సిల్ సర్వీసెస్, షాపు నెం. 59 అవని ట్రాన్స్‌పోర్టు, షాపు నెం.99 ధనలక్ష్మి డెయిలీ పార్సిల్ సర్వీస్, షాపు నెం.197 శ్రీహనుమాన్ లారీ ట్రాన్స్‌పోర్టు, షాపు నెం.200 పద్మావతి డెయిలీ పార్సిల్ సర్వీస్‌లో విదేశీ సిగరెట్ల బండిల్స్ దిగుమతి చేసుకుని ఆ బండిల్స్‌ను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నట్టు విజిలెన్స్ అధికారులకు తెలిసింది. దీంతో ఈనెల 13న ఉన్నతాధికారుల ఆదేశాలతో సీఐ, ఎస్ఐలు తమ సిబ్బందితో వెళ్లి ఆయా ట్రాన్స్‌పోర్టులపై దాడులు చేశారు. విజయలక్ష్మి డెయిలీ పార్సిల్ సర్వీసెస్‌లో మూడు గన్నీ బోరీలు, అవని ట్రాన్స్‌పోర్టులో మూడు, ధనలక్ష్మి డెయిల్ పార్సిల్ సర్వీస్‌లో 6, హనుమాన్ లారీ ట్రాన్స్‌పోర్టులో 3, పద్మావతి డెయిల్ పార్సిల్ సర్వీస్‌లో అయిదు గన్నీ బోరీలు అధికారులకు లభించాయి. మొత్తం 20 గన్నీ బోరీల్లో విదేశీ సిగరెట్లు విలువ సుమారు రూ.36 లక్షలున్నట్టు తెలిసింది. స్వాధీనం చేసుకున్న సిగరెట్లను విజిలెన్స్ అధికారులు సంబంధిత అధికారులకు అప్పగించి ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు, సిబ్బందిపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారాన్ని బయటకు రానీయకుండా అధికారులు గోప్యంగా ఉంచటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



అధికారులు లోకల్ ట్రాన్స్‌పోర్ట్‌లో స్వాధీనం చేసుకున్న విదేశీ సిగరెట్లు

అభివృద్ధిని అడ్డుకోవటం అసాధ్యం: నాగుల్‌మీరా

వన్‌టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకోవటం అసాధ్యమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా అన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. బుధవారం గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో నాగుల్ మీరా మీడియా సమావేశంలో మాట్లాడారు. అమెరికాలోని అతిపెద్ద సంస్థ అయిన గూగుల్‌ను రాష్ట్రానికి తీసుకురావటంతో మంత్రి లోకేశ్ కీలకపాత్ర పోషించారని కొనియాడారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేశ్ నాయకత్వంలో ప్రధాన మంత్రి మోదీ సహకారంతో రాష్ట్రం శరవేగంగా ముందుకు వెళ్లటం ఖాయమన్నారు.

గూగుల్ రాకతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి

చిట్టినగర్: గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి, చెందుతుందని నగరాల వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మరుపిళ్ల తిరుమలేష్ అన్నారు. బుధవారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్ 51వ డివిజన్ టీడీపీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి వికేంద్రీకరణ మాటలకే పరిమితం చేయకుండా శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధి కంపెనీలను రాష్ట్రానికి తెస్తున్నారన్నారు. డైరెక్టర్లు సుకాశి కిరణ్‌కుమార్, బెవర సాయి సుధార్ పాల్గొన్నారు.



కూచిపూడి నాట్య తేజం వెంపటి

విజయవాడ కల్చరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సిద్ధేంద్ర యోగి నుంచి ప్రారంభమైన కూచిపూడి నాట్య సంప్రదాయాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహానుభావుల్లో పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం అగ్రగణ్యులని నాట్యాచార్యుడు చింతా రవి బాలకృష్ణ అన్నారు. భారత శాస్త్రీయ నృత్యాల్లో కూచిపూడి నాట్యానికి సమున్నత ప్రతిష్ఠను కల్పిస్తూ, శాస్త్రతను కాపాడుతూ కొత్త ప్రయోగాలతో నాట్యానికి కొత్త దిశనిచ్చిన మహానుభావుడన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ, అమరావతి శాస్త్రీయ నాట్యాచార్యుల సంఘం, ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఆ కళాశాల ప్రాంగణంలో పద్మభూషణ్ వెంపటి చినసత్యం 96వ జయంత్యుత్సవాలు వైభవంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ సీ జ్యోతిర్మయి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కూచిపూడి సిద్ధేంద్ర యోగి కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ, ఇతర నాట్యాచార్యులు పాల్గొన్నారు. అమరావతి శాస్త్రీయ నాట్యాచార్యుల సంఘం సభ్యులు, నాట్యాచార్యులు పద్మశ్రీ హేమంత్, చిముడూరి అజయ్‌కుమార్, త్రినాథాచారి, రాయన శ్రీనివాసరావు, హపీషా, అనూష, యల్లాజోస్యుల అనురాధ, దేవరకొండ చంద్రశేఖర్, చదలవాడ ఆనంద్ తమ శిష్యులతో కలిసి దాదాపు 150 మందికి పైగా నర్తకులు పాల్గొని నాట్యగురువు వెంపటి చినసత్యంకు నృత్య నీరాజనం అర్పించారు. బ్రహ్మాంజలి, జతిస్వరం, హిందోళం తిల్లానా వంటి అంశాలతో ఆహ్లాదకరంగా సాగిన ఈ బృంద నృత్య సమర్పణకు ప్రేక్షకులు ఘనంగా అభినందించారు.

చెత్త లిఫ్టింగ్ యార్డు వద్ద ఉద్రిక్తత

- రోడ్డుపై చెత్త వేస్తుండగా ఆటోనగర్ కార్మికుడిపై పడటంతో ఆందోళన
- ఆటోనగర్ కార్మికులు, తాడిగడప మున్సిపల్ సిబ్బంది వాగ్వాదం
- అసిస్టెంట్ కమిషనర్, పోలీసులు సర్దిచెప్పడంతో తాత్కాలిక తెర

ఆటోనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జవహర్ ఆటోనగర్-తాడిగడప మున్సిపాలిటీకి సరిహద్దుగా గుంటుతిప్ప డ్రెయిన్‌రోడ్డులోని చెత్త లిఫ్టింగ్ యార్డు వద్ద బుధవారం ఆటోనగర్‌లోని కార్మికులకు, తాడిగడప మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది మధ్య గొడవ జరిగి ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో సేకరించిన చెత్తను గుంటుతిప్ప డ్రెయిన్‌రోడ్డులోని చెత్త లిఫ్టింగ్ యార్డుకు తెచ్చి రోడ్డు మార్జిన్‌లో వేస్తుండగా అటుగా వెళుతున్న ఆటోనగర్ కార్మికుడిపై పడింది. దీంతో ఆ కార్మికుడికి, వాహనం నుంచి చెత్తకార్పే సిబ్బందికి వాగ్వాదం జరిగింది. దీంతో ఆటోనగర్‌లోని కార్మిక సంఘాల నేతలు, కార్మికులు రావడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తాడిగడప మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కిరణ్‌తోపాటు పెనమలూరు పోలీసులు అక్కడకు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి గొడవను సర్దుబాటు చేశారు. కిరణ్ ఇలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా సుంకర దుర్గాప్రసాద్ ఆంధ్రజ్యోతి ప్రతినిధితో మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీ వారు తెచ్చిన చెత్తను యార్డుకి తీసుకువెళ్లకుండా రోడ్డుపైనే గ్రేడింగ్ చేస్తున్నారని, దీంతో గుంటుతిప్ప డ్రెయిన్‌రోడ్డు ప్రాంతం చెత్తతో నిండి అటుగా వెళ్లేవారిపై పడి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఆ ప్రాంతం నుంచి వచ్చే దుర్వాసనతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. అధికారులు దృష్టి సారించి రోడ్డుపై చెత్తను డంపింగ్ చేయకుండా యార్డులోని తీసుకువెళ్లేలా చర్యలు తీసుకోవాలని దుర్గాప్రసాద్ విజ్ఞప్తి చేశారు.





చెత్త లిఫ్టింగ్ యార్డు వద్ద ఆందోళన చేస్తున్న ఆటోనగర్‌లోని కార్మికులు

రేపు టీటీడీ గీతాశ్లోక కంఠస్థ పోటీలు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాల హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు, యువతలో ధార్మిక చైతన్యం, నైతిక విలువలు పెంపొందించే దిశగా శ్రీమద్ భగవద్గీత పోటీలు నిర్వహించినట్టు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవంబర్ 25న ఉదయం 9 గంటలకు గాంధీనగర్‌లోని చిట్టూరి హైస్కూల్ ప్రాంగణంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ సీవీకే ప్రసాద్ మాట్లాడుతూ గీతాశ్లోక కంఠస్థ పోటీలు మూడు విభాగాలుగా నిర్వహిస్తున్నామని, 6 నుంచి 9వ తరగతి వరకు ఉన్న విద్యార్థులకు 14వ అధ్యాయం "గుణత్రయ విభాగ యోగము"లోని శ్లోకాల ఆధారంగా పోటీలు జరుగుతాయన్నారు. 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు 16వ అధ్యాయం "దైవాసుర సంపద్విభాగ యోగము"లోని శ్లోకాల ఆధారంగా పోటీలు ఉంటాయని, 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయస్కుల కోసం "నిత్యజీవితంలో భగవద్గీత" అనే అంశంపై విశ్లేషణాత్మ ప్రసంగ పోటీలు జరుగుతాయన్నారు. ప్రథమ బహుమతిగా రూ.1,116, 2వ బహుమతి రూ.816, తృతీయ బహుమతి రూ.516 నగదుతో పాటు విజేతలకు సర్టిఫికెట్లు అందజేయనున్నట్టు తెలిపారు. బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గార్లపాటి విజయకుమార్, టీటీడీ జిల్లా ధార్మిక కమిటీ సభ్యులు వెంకట బాలకోటేశ్వరరావు, నండూరి వెంటక తాండవ కృష్ణ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

సూపరింటెండెంట్‌కు 'రెండేళ్ల' బెదిరింపులు

విజయవాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో ఆవరణలో ఆకలిరాజ్యం పేరుతో క్యాంటీన్ నడుస్తోంది. దీని అద్దె గడువు ఈనెల 24తో ముగుస్తుంది. మంగళవారం జరిగిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో రూపొందించిన అజెండాలో ఈ అంశాన్ని అధికారులు ప్రస్తావించారు. క్యాంటీన్‌కు ఏడాది గడువును పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. నిర్వాహకులు సంతృప్తి చెందలేదు. రెండేళ్లపాటు పెంచాలని ఆసుపత్రి అధికారులపై ఒత్తిడి తెచ్చారు. సూపరింటెండెంట్ అంగీకరించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు తన ఇంటికి వచ్చి బెదిరించారని సూపరింటెండెంట్ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికి కౌంటర్‌గా ఆకలిరాజ్యం క్యాంటీన్ యజమాని ముప్పూరి హరీష్ మాచవరం పోలీసులకు మరో ఫిర్యాదు చేశారు. పాత ప్రభుత్వాసుపత్రిలో పనిచేసే హాక్‌మాన్ అనే వ్యక్తి క్యాంటీన్ టెండర్ దక్కకపోవడంతో తమను ఇబ్బంది పెడుతున్నాడని ఫిర్యాదు చేశాడు. దాన్ని దృష్టిలో పెట్టుకుని సూపరింటెండెంట్ ఇంటికి వెళ్లి తమ క్యాంటీన్ పేరును ఉపయోగించి ఆయన్ను బెదిరించినట్టు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(కి.లో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

యువతకు ఉపాధి కల్పనే ధ్యేయం

గుడివాడ : గూగుల్ రాకతో రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి కల్పించాలనే సంకల్పంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు అహర్నిశలు శ్రమించి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నారని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నూకాలమ్మ, శ్రీకాంత్, రవికుమార్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

నందివాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకాన్ని పోలుకొండ జిల్లా పరిషత్ పాఠశాలను ఎంఈవో-2 డేవిడ్ రత్నరాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డేవిడ్ రత్నరాజు మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలసి చేశారు. పాఠశాల హెచ్ఎం వి.మణి, ఉపాధ్యాయులు కె.శ్యామ్ ప్రసాద్, వి.భాగ్యకుమారి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా ధర్మచక్ర పరివర్తన దివస్

గుడివాడ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 5లక్షల మందితో బౌద్ధమతం స్వీకరించిన రోజును పురస్కరించుకుని బౌద్ధ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి స్థానిక నెహ్రూచౌక్ సెంటర్‌లో ధర్మచక్ర పరివర్తన దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన శ్రీలంక బౌద్ధ బిక్షు బోధిహీన్ గౌతమ్ బుద్ధ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామకృష్ణ, పులి శ్రీనివాస్ పాల్గొన్నారు.



జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు

● రావి వెంకటేశ్వరరావు

గుడివాడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతగానో మేలు జరుగుతుందని, ప్రజల ఆదాయం పెరుగుతుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ప్రజావేదికలో కూటమి నాయకులతో కలిసి బ్రోచర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఎన్‌డీఏ ప్రభుత్వం వస్తు సేవల పన్ను(జి.ఎస్.టి)తగ్గించి ప్రజలకు పన్నుభారం నుంచి ఉపశమనం కలిగించిందన్నారు. నిత్యావసర వస్తువులపై జీఎస్టీ పూర్తిగా ఎత్తివేయడం శుభపరిణామమన్నారు. అనంతరం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించి వ్యాపార దుకాణాల వద్దకు వెళ్లి జీఎస్టీ తగ్గింపు వల్ల కలుగు ప్రయోజనాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గోకవరపు సునీల్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జాడ నాగరాజు, నియోజకవర్గ పరిశీలకులు నూకాలమ్మ, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నాయకులు అంగడాల సతీష్, గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్ పాల్గొన్నారు.

గుడివాడ రూరల్ : పారిశ్రామిక కూడళ్లలో జీఎస్టీ తప్పనిసరిగా అమలు చేయాలని ఎంపీడీవో విష్ణుప్రసాద్ అన్నారు. బుధవారం గుడివాడలో ఉన్న సెవన్ హోటల్‌లో మేనేజ్‌మెంట్, వినియోగదారులకు సిబ్బంది జీఎస్టీపై అవగాహన కల్పించారు. ప్రతీ వ్యక్తి జీఎస్టీ 2.0 మారిన విధానాన్ని తెలుసుకోవాలన్నారు. ఎవరైనా వ్యాపారులు పాత రేట్లకు అమ్మితే వారిని నిలదీయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో జి.శ్రీనివాసరావు, కార్యదర్శులు పాల్గొన్నారు.



జీఎస్టీపై అవగాహన బ్రోచర్‌లను విడుదల చేస్తున్న రావి, తదితరులు

అసభ్య ప్రవర్తనపై కేసు నమోదు

గుడివాడ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మోటూరుకు చెందిన 20 ఏళ్ల యువతి ఫిర్యాదు మేరకు గరికపాటి రామకృష్ణ (25) అనే వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఫిర్యాదుదారిణి ఫార్మసీ విద్యార్థిని రావులపాలెంలోని ఒక ప్రైవేట్ కాలేజీలో చదువుతూ హాస్టల్‌లో నివశిస్తుంది. ఆమె ఎప్పటికప్పుడు ఇంటికి వచ్చినప్పుడు గరికపాటి రామకృష్ణ ప్రేమపేరుతో ఆమె ఇంటిలోకి అక్రమంగా ప్రవేశించి, అసభ్యంగా మాట్లాడి, ఆమెను వేధించేవాడు. ఇంటి వద్ద ఉన్న ఆటో అద్దాలనూ పగలగొట్టాడని ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి, ట్రైనీఎస్సై టి.లోకేశ్వరి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ కార్యదర్శికి సత్కారం

గుడివాడ రూరల్ : బొమ్ములూరు పంచాయతీ కార్యదర్శి రామ్మోహనరావు జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రధాన కార్యదర్శిగా నియామకం పట్ల బుధవారం బొమ్ములూరు పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. బొమ్ములూరుకు చెందిన మాజీ ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ ఆధ్వర్యంలో రామ్మోహనరావును సన్మానించారు. శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నవీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరకణకు ముందస్తు చర్యలు

పెదపారుపూడి : ధాన్యం సేకరణలో సమస్యలు ఉత్పన్నం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవటంతోపాటు రైతులందరికీ సకాలంలో సేవలు అందించాలని తహసీల్దార్ శ్రీను నాయకర్ అన్నారు. బుధవారం ఎంఈవో కార్యాలయంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహించటంపై వీఆర్‌వోలు, వీపీఏలు, ఎఫ్‌పీవో సిబ్బంది, మిల్లర్స్‌కు ధాన్యం సేకరణపై శిక్షణ ఇచ్చారు. గ్రామస్థాయిలో కమిటీ సభ్యులైన గ్రామ వ్యవసాయ సహాయకులకు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏవో జి.ఆంజనేయులు, వీఆర్వోలు, వీపీఏ తదితరులు పాల్గొన్నారు.

చిన్నసత్యం జయంతి

కూచిపూడి : ప్రముఖ నాట్యాచార్యులు స్వర్గీయ పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చిన్నసత్యం 96వ జయంతి వేడుకలను కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కూచిపూడి నాట్యానికి ఆయన చేసిన సేవలు కొనియాడారు.ఏఎంసీ చైర్మన్ దోనేపూడి శివరామయ్య, కళాపీఠం వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, యేలేశ్వరపు శ్రీనివాస్, దుర్గాభవాని, ఫణికుమార్ పాల్గొన్నారు.

నాట్య ప్రదర్శనకు ఆహ్వానం

కూచిపూడి : గురువారం కర్నూలులో జరిగే బహిరంగ సభలో పాల్గొనేందుకు ప్రధాని మోదీ విచ్చేస్తున్న సందర్భంగా ఆ సభలో నాట్య ప్రదర్శన ఇచ్చేందుకు కూచిపూడి కళాకారులకు ఆహ్వానం లభించింది. ఏపీ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ , సృజనాత్మక సంస్కృతి సమితిల పర్యవేక్షణలో జీఎస్టీ అంశానికి సంబంధించి కూచిపూడి కళాకారులు నాట్య ప్రదర్శన ఇవ్వనున్నారు. కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ నృత్య దర్శకత్వంలో కూచిపూడి కళాపీఠం విద్యార్థుల నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు.

విద్యుత్ వైర్లపై ఒరిగిన భారీ వృక్షం .. తప్పని తిప్పలు

కూచిపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి నుంచి నిడుమోలు వెళ్లే ప్రధాన రహదారిలో చిన ముత్తేవి ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన భారీ వృక్షం ఒరిగిపోయింది. విద్యుత్ తీగలపై వేలాడుతూ తరచూ విద్యుత్‌కు అంతరాయం కలుగుతున్నప్పటికీ ఆ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించటంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వృక్షాన్ని తొలగించి విద్యుత్ పునరుద్ధరించాలంటే రూ.25 వేలు ఖర్చు అవుతుందని, విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటూ చేతులు దులుపుకున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. వృక్షాన్ని తొలగించాల్సిందిగా ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి ప్రయోజనం కనిపించలేదు. గ్రామంలో తరచూ విద్యుత్‌కు అంతరాయం కలుగుతూ ఇబ్బందులు పడుతున్నట్లు గ్రామస్థులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా చర్యలు చేపట్టాలని కొమ్ము అర్జునరావు, పోతుల నాగేంద్రం, చెన్నకేశవ, పోతుల మహేష్ చంద్ర, మాదాసు నాగులు కోరుతున్నారు.



విద్యుత్ తీగలపై ఒరిగిన వృక్షం

వైభవంగా గంగానమ్మ, పోతురాజు విగ్రహాల గ్రామోత్సవం



గ్రామోత్సవంలో అమ్మవారు

గుడ్లవల్లేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : గుడ్లవల్లేరులో వంద సంవత్సరాల ఘన చరిత్ర కల్గిన గంగానమ్మ అమ్మవారి దేవాలయం జీర్ణోద్ధరణ, ఆలయ పునఃనిర్మాణం నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం అమ్మవారి నూతన విగ్రహాన్ని గ్రామోత్సవం కన్నుల పండుగ గా నిర్వహించారు. తమిళనాడు కు చెందిన మహాబలిపురంలో గంగానమ్మ, పోతురాజు వార్ల విగ్రహాలు ప్రఖ్యాత శిల్పితో రూపొందించారు. ఆ విగ్రహాలు బుధవారం గ్రామానికి రాగా గ్రామ పొలిమేరల నుంచి గ్రామస్థులు మేళతాళాలతో ఎదురేగి స్వాగతం పలికారు. అమ్మవారి విగ్రహాలకు పూజలు నిర్వహించి గ్రామంలోకి గ్రామోత్సవంగా తీసుకు వచ్చారు. గ్రామంలోని పలు వీధుల్లో ఊరేగింపు ముగించి అమ్మవారి, పోతురాజు విగ్రహాలను శివాలయంలో దాన్యాధివాసంలో ఉంచి బధ్రపరిచారు. కార్యక్రమాల్లో గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, శివాలయం చైర్మన్ కొసరాజు వెంకటాద్రి, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏఐపై అవగాహన అవసరం

● కె.ఎస్ అప్పారావు

గుడివాడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : ఆధునిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు(ఏఐ) విశేషత వినియోగం గురించి విద్యార్థులు తెలుసుకోవాలని, ఏఐలో నైపుణ్యం పొందాలని ఏఎన్ఆర్ కళాశాల కార్యదర్శి కె.ఎస్ అప్పారావు అన్నారు. బుధవారం స్థానిక అక్కినేని నాగేశ్వరరావు ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో గొప్ప శాస్త్రవేత్త, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా,11వ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 94వ జయంతిని పురస్కరించుకుని ఇంటాక్టివ్ సెషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ తమ జీవితంలో ఒక గొప్ప లక్ష్యాన్ని నిర్దేశించుకుని నిరంతరం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామారావు, పాలకవర్గ అధ్యక్షుడు ఎల్ఆర్‌కే ప్రసాద్, కోశాధికారి పి.కృష్ణప్రసాద్, ఏఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్ కుమార్, పాల్గొన్నారు.



విద్యార్థులకు కలాం గురించి వివరిస్తున్న అప్పారావు

రైతుల సమస్యల పరిష్కారమే ధ్యేయం

● తహసీల్దారు లోకరాజు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు లోకరాజు

గుడ్లవల్లేరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖలు సమష్టి కృషితో రాబోయే రెండు నెలలు ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని గుడ్లవల్లేరు తహసీల్దారు లోకరాజు అన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రాంభించనున్న నేపథ్యంలో వ్యవసాయ శాఖ, రెవెన్యూ శాఖల ఉద్యోగులతో సమీక్షా, ప్రణాళికా రూపకల్పనా కార్యక్రమాన్ని బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు లోకరాజు మాట్లాడుతూ మండలంలో 10 వేల మంది రైతులు, కౌలు రైతులు వరిని సాగుచేస్తున్నారన్నారు. ండలంలో ధాన్యం తోలు కొనేందుకు వీలుగా ట్రాక్టర్‌లను,లారీల యజమానులతో ముందుగానే మాట్లాడి వారికి జియోట్యాగింగ్ చేయించి రిజిస్టర్ చేయాలని ఈ ప్రక్రియ వేగవంతంగా నిర్వహించాలని ఆయన సంబందిత ఉద్యోగులను ఆదేశించారు. గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, ఎంపిడిఓ మహమ్మద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో డాక్టర్ కేకేఆర్స్‌గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : ఇటీవల చెన్నైలో జరిగిన 22వ ఆల్‌ఇండియా ఓపెన్ కరాటే పోటీల్లో స్థానిక డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాల విద్యార్థులు కాంస్య పతకం సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాల ఆవరణలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14సంవత్సరాల లోపు బాలుర వ్యక్తిగత కుమితె విభాగంలో 8వతరగతి విద్యార్థులు కె.సాయి చరణ్, కె.కౌషిక్, డి.ఉజ్వల్‌లు తృతీయ స్థానిక సాధించి కాంస్య పతకాన్ని సాధించినట్లు తెలిపారు. పతకం సాధించిన విద్యార్థులు, కోచ్ ఎన్.వెంకటేశ్వరరావులను ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయ కుమారి



సదస్సులో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ విజయకుమారి

పామర్రు,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పలు వ్యాధులు దూరమవుతాయని పామర్రు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. ఎనిమిదోవ రాష్ట్రీయ పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా మండల స్థాయిలో బుధవారం స్థానిక కంచర్ల రామారావు జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో చిన్నారుల తల్లులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పనిచేసే అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణులు, బాలింతలకు అందించే ప్రభుత్వపథకాలను సద్వినియోగం చేసుకునే రీతిలో ప్రోత్సహించాలన్నారు. ప్రతి తల్లి బిడ్డకు ముర్రుపాలు తాగిస్తే వ్యాధినిరోధకశక్తి పెరిగి బిడ్డ ఆరోగ్యవంతంగా జీవించే అవకాశం ఉందన్నారు.

పెదపారుపూడి : బాలింతలు, గర్భిణులు పౌష్టికాహారంపై అవగాహన పెంపొందించుకోవాలని సూపర్‌వైజర్ అరుణ కుమారి అన్నారు. బుధవారం ఎలమర్రు సచివాలయంలో పౌష్టికాహార మహోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ ఏడు నెలలు నిండిన దగ్గర నుంచి పిల్లలకు బాలామృతంతోపాటు అనుబంధ పోషకాహారం తినే ఆహారంలో ఏదైనా లిక్విడ్ రూపంలో తయారు చేసి పెట్టాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు చక్కగా, మెత్తగా చేసి పిల్లలకి ఆహారంగా పెట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.













బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258

నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 550

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

అవనిగడ్డ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీఎల్ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 147 మంది హాజరు కాగా 116 మంది రెండో దశ ఇంటర్వ్యూకు ఎంపికయ్యారు. జాబ్‌మేళాను మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. ప్రతీ మూడు నెలలకొకసారి స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఉచిత జాబ్‌మేళాలు నిర్వహిస్తోందని ఆయన తెలిపారు. మేళాలో హెటిరో ల్యాబ్, జాయలూకాస్, ముత్తూట్ ఫైనాన్స్, ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీసెస్, శ్రీనివాస ట్రాక్టర్స్, అపోలో ఫార్మసీ, పేటియం సంస్థలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ పి.నరేష్‌కుమార్, ఎస్వీఎల్ క్రాంతి కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి తుర్లపాటి మధుకుమార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ డెవలప్‌మెంట్‌సెంటర్ కో-ఆర్డినేటర్ పృథ్వీజ, రాచూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

పైడమ్మ, పల్లోటి లే అవుట్లలో
మౌలిక సదుపాయాలు కల్పించండి

● అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం



గృహాల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పెడన, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పైడమ్మ, పల్లోటి లే అవుట్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. పైడమ్మ, పల్లోటి లే అవుట్లలో నిర్మించిన గృహాలతో పాటు నిర్మాణంలో ఉన్న గృహాలను ఆయన పరిశీలించారు. పైడమ్మ లే అవుట్‌లో 888 గృహాలు మంజూరు కాగా 614 ఇళ్లు పూర్తయ్యాయని, 274 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని కలెక్టర్‌కు గృహ నిర్మాణ సంస్థ ఏఈ మాధవి వివరించారు. ఈ లే అవుట్‌లోని గృహాల లబ్ధిదారులు రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం పల్లోటి లే అవుట్‌ను కలెక్టర్ పరిశీలించి అక్కడి గృహాలను పరిశీలించారు. ఈ లే అవుట్‌లో 660 గృహాలు మంజూరు కాగా 395 పూర్తయ్యాయని, 265 వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని ఏఈ మాధవి వివరించారు. ఈ లే అవుట్‌లోని లబ్ధిదారులు వీధి దీపాలు, చోరీలు, ముంపు సమస్యలను ప్రస్తావించారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గృహ నిర్మాణ సంస్థ జిల్లా అధికారి పోతురాజు, టి.వి.బుచ్చిబాబు, మునిసిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి, తహసీల్దార్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించండి



డిప్యూటీ సూపరింటెండెంట్ భానుమూర్తి, ఆర్ఎంవో నిరంజన్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సర్వజన ఆస్పత్రి ఎమ్మారై స్కానింగ్ విభాగంలో ఫిలిం కోసం నగదు జమ చేయించుకునే విషయంలో రోగికి రోగికీ మధ్య వ్యత్యా సం చూపుతున్నారని, రక్త సేకరణకు టోర్నికిట్లు వాడడం లేదని ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ భానుమూర్తి, ఆర్ఎంవో నిరంజన్‌కు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం బుధవారం వినతిపత్రం అందించారు. ఎమ్మారై స్కానింగ్ విభాగం వద్ద స్కానింగ్ చేయించుకున్న వారికి ఫిలిం కోసం నగదు జమ చేయించుకున్నాక రశీదు ఇవ్వడం లేదని తెలిపారు. స్కానింగ్ విభాగం వద్ద ధరల పట్టికను ఏర్పాటు చేయాలని, రశీదు అందజేయాలని కోరామని సుబ్రహ్మణ్యం తెలిపారు. రక్తసేకరణ విభాగం వద్ద టోర్నికిట్‌ను కట్టి రక్తం సేకరించటానికి బదులుగా సెలైన్ ట్రాన్స్‌ఫ్యూజన్ సెట్ వాడుతున్నారని, దీనివల్ల తీవ్రమైన నొప్పికి గురవుతున్నారని సుబ్రహ్మణ్యం తెలిపారు. చింతపట్ల నాని, ఎస్.రాధాకృష్ణ, పెద్దిబోయిన సాంబ, రామరాజు, చేబోయిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులకు నోటీసులు



రుద్రవరంలో టిడ్కో ఇళ్లకు నోటీసులు అంటిస్తున్న యూనియన్ బ్యాంక్ అధికారులు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రుద్రవరంలో టిడ్కో ఇళ్లలో నివసిస్తున్న లబ్ధిదారులకు యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ కొవ్వూరి రామలింగారెడ్డి, రికవరీ చీఫ్ మేనేజరు రాకేష్, జిల్లా పరిషత్ యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజరు నవక్రాంత్‌లు బుధవారం నోటీసులు అందజేశారు. ఇళ్ల కోసం బ్యాంక్ ద్వారా పొందిన రుణం చెల్లించక పోవడంతో బ్యాంక్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందనే అపోహతో గృహ యజమానులు రుణాలు చెల్లించడం లేదని బ్యాంకు అధికారులు తెలిపారు. ఇళ్లు కేటాయించినప్పటికీ నివాసం ఉండని లబ్ధిదారుల ఇళ్లకు నోటీసులు జారీ చేశామన్నారు. నివాసం ఉండక పోవడం వల్ల రుణాలు చెల్లించబోమని చెప్పడం సరి కాదన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి

సాంకేతిక సాధనాల
వినియోగంపై రైతులకు శిక్షణ

చల్లపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వక్కలగడ్డ సచివాలయంలో బుధవారం రైతులకు ఐసీటీ సాంకేతిక సాధనాల వినియోగం, ప్రస్తుతం వరిలో కాలానుగుణంగా తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై ఘంటసాల కృషివిజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సాంకేతిక మార్పులకు అనుగుణంగా రైతులు సమాచారం పొందాలని, అందుబాటులో ఉన్న వాట్సాప్, సామాజిక మాధ్యమాల ద్వారా వివరాలు తెలుసుకోవాలని ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి సూచించారు. యాప్‌ల వినియోగంపై రైతులకు శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ వివరించారు. శాస్త్రవేత్త ఎం.వెంకటలక్ష్మి, చల్లపల్లి ఏవో ఎం.మురళీకృష్ణ, వీఏఏ హరిత, రైతులు పాల్గొన్నారు.

వరి, మినుము సాగుపై రైతులకు అవగాహన

నాగాయలంక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వరి, మినుము పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులపై ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం బృందం బుధవారం రైతులకు శిక్షణ ఇచ్చింది. రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడారు. రసాయనేతర పద్ధతులు అవలంబించి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని రైతులకు ఆమె సూచించార. వరిలో ఎలుకల నిర్మూలన పద్ధతులను వివరించారు. మినుము పంటలో విత్తనాల ఎంపిక, విత్తనశుద్ధి, వైరస్, తెగుళ్ల సమగ్ర యాజమాన్యంపై అవగాహన కల్పించారు. వ్యవసాయ పథకాలపై రైతులకు అవనిగడ్డ సబ్ డివిజన్ ఏడీఏ జయప్రద వివరించారు. కేవీకే శాస్త్రవేత్తలు రేవతి, వెంకటలక్ష్మి, యశ్వంత్‌కుమార్, ఏవో ఎ.సంజీవ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వసతిగృహాల్లో నీటి నమూనాల సేకరణ

అవనిగడ్డ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డలోని ప్రభుత్వ వసతిగృహాల్లో వైద్యఆరోగ్యశాఖ నీటి శాంపిళ్లను సేకరించింది. వేకనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ తారక రామారావు, ఎంఎల్‌హెచ్‌పీ ప్రియాంక, పుష్పదీవెన, భార్గవి, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సాయికృష్ణ, రాజా రఘు పాల్గొన్నారు. పదిచోట్ల నీటి శాంపిళ్ల సేకరించారు.

అధ్వాన రహదారి

● అవస్థలు పడుతున్న ప్రజలు

(కోడూరు-ఆంధ్రజ్యోతి): కోడూరు నుంచి నరసింహాపురం మీదుగా విశ్వనాథపల్లి వెళ్లే రహదారి అధ్వానంగా ఉంది. రోడ్డుపై గుంతల కారణంగా రాకపోకలకు చాలా ఇబ్బంది పడుతున్నామని, గుంతలు పూడ్చాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు. కోడూరు సంత మార్కెట్ వద్ద నరసింహాపురం, విశ్వనాథపల్లి గ్రామాల మధ్య రహదారి పూర్తిగా పాడైపోయిందన్నారు. వర్షం కురిస్తే ద్విచక్ర వాహనాలపైన కూడా మండల కేంద్రానికి రాలేకపోతున్నామని, 5 కిలోమీటర్ల మేర తిరిగి మండల కేంద్రానికి రావాల్సి వస్తోందని చెబుతున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మించడమో లేక మరమ్మతులో చేయాలని కోరుతున్నారు.



కోడూరు నుంచి నరసింహాపురం మీదుగా విశ్వనాథపల్లి వెళ్లే రహదారిలో గుంతల్లో నిలిచిన వర్షపు నీరు

శిథిలావస్థకు వంతెన రెయిలింగ్



మోదుమూడి వెళ్లే ప్రధాన రహదారిలో వంతెనపై శిథిలావస్థకు చేరిన రెయిలింగ్

(అవనిగడ్డ రూరల్-ఆంధ్రజ్యోతి): మోదుమూడి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న వంతెన రెయిలింగ్స్ శిథిలావస్థకు చేరాయి. రెండున్నర దశాబ్దాల క్రితం ఈ వంతెన నిర్మించారు. వంతెన బాగానే ఉన్నప్పటికీ రెయిలింగ్స్ పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. రెయిలింగ్స్ బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కల్తీ మద్యం కేసు.. దిక్కుతోచని స్థితిలో వైసీపీ

● టీడీపీ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): 'కల్తీ మద్యం సినిమా ట్రయలర్ ఫ్లాప్ కావడం, ప్రధాని సూత్రధారి జోగి రమేశ్ అని నిందితుడు జనార్దనరావు చెప్పడంతో వైసీపీ నాయకులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. కేసు నమోదైనప్పటి నుంచి రోజుకొక నాటకీయ పరిణామాన్ని మాజీ మంత్రి పేర్ని నానీ రక్తికట్టిస్తున్నారు. జోగి రమేశ్‌కు పేర్ని నానీ సన్నిహితుడు. పేర్ని పాత్రపైనా కొన్ని అనుమానాలు వస్తున్నాయి.' అని టీడీపీ మండల అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం టీడీపీ కార్యాలయంలో పార్టీ నేతలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కొల్లు రవీంద్రపై మాజీ ఎమ్మెల్యే పేర్ని నానీ చేస్తున్న వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కల్తీ మద్యం మరకలను కూటమి ప్రభుత్వానికి అంటిద్దామని వైసీపీ నాయకులు ప్రయత్నం చేశారని, కొల్లు రవీంద్రపై వ్యక్తిగత విమర్శలు చేశారని, ఏ1గా ఉన్న జనార్దనరావును సిట్ అధికారులు విచారణలో చేయడంతో జోగి రమేశ్ బాగోతం బయటపడిందని తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. దీంతో పేర్ని నానీకి సన్నిహితుడుగా ఉన్న జోగి రమేశ్ నిందితుడని తేలిందన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ కుంచే నాని మాట్లాడుతూ, నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తున్న కొల్లు రవీంద్రపై పేర్ని నానీ మతి భ్రమించి విమర్శలకు దిగుతున్నారన్నారు. లంకే నారాయణ ప్రసాద్, లంకే శేషగిరి, చిన్నాపురం సర్పంచ్ కాగిత గోపాలరావు, కాటం మధు, పాలపర్తి పద్మజ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయండి

● రైతులకు వ్యవసాయ శాఖ జిల్లా డీడీ మనోహరరావు సూచన

పెడన రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక పద్ధతుల ద్వారా వ్యవసాయం చేసి అధిక దిగుబడులు సాధించాలని, అవసరం మేరకే పంటల్లో ఎరువులను వినియోగించాలని వ్యవసాయ శాఖ జిల్లా డీడీ మనోహరరావు సూచించారు. నడుపూరులోని రైతు సేవా కేంద్రంలో రైతులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేందుకు శాస్త్రీయ పద్ధతులు పాటించాలన్నారు. మండలంలో 18 చోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా వనరుల కేంద్రం డీడీ జ్యోతిరమణి తెలిపారు. ఏవో పద్మజారాణి, ఎస్.జెన్నీ, సాయికిరణ్, వెంకటేశ్వరరావు, నీటిసంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలి



మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు

చల్లపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేసి వ్యవసాయ రంగాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఏపీ రైతుసంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మండల మహాసభ గుంటూరు బాపనయ్య శ్రామిక భవనంలో బుధవారం పి.సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా నాగేశ్వరరావు పాల్గొన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేయక తప్పదన్నారు. రైతుసంఘం అధ్యక్షుడు కోసూరు నాగేంద్ర, సీపీఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర పోటీలకు లింగారెడ్డిపాలెం విద్యార్థినులు



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం నాగరత్నకుమారి

కోడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీలకు లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు 8 మంది ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం కె.నాగరత్నకుమారి తెలిపారు. ఇటీవల విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపికల్లో 8 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచారని ఆమె తెలిపారు. వీరు పల్నాడులో నిర్వహించే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో జిల్లా తరపున ఆడతారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో పీటీ అప్పికట్ల వెంకటతాతాజీరావుతో కలిసి ఆమె అభినందించారు.

ఓట్ల దొంగలు గద్దె దిగాలి

● కాంగ్రెస్ పార్టీ నిరసన, సంతకాల సేకరణ

అవనిగడ్డ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి పాల్పడుతున్న దొంగలు గద్దె దిగాలని కాంగ్రెస్ పార్టీ అవనిగడ్డలో నిరసన ప్రదర్శన చేపట్టింది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరిన నేతలు తొలుత మహాత్మాగాంధీ విగ్రహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఓబీసీ విభాగం చైర్మన్ శొంఠి నాగరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి అందె శ్రీరామమూర్తి, నరహరశెట్టి శ్రీమన్నారాయణ, అందె లెనిన్, మత్తిరెడ్డి వెంకటేశ్వరరావు, అర్జా నాగేంద్రం, అద్దంకి సుధాకర్‌రావు, లంకే ఆంజనేయవర్మ, జరుగు నాగరాజ్యం తదితరులు పాల్గొని ప్రజల నుంచి సంతకాలు సేకరించారు.

ఘనంగా కలాం జయంతి



గాంధీ క్షేత్రంలోని అబ్దుల్ కలాం విగ్రహానికి కూటమి నాయకులతో కలిసి నివాళులర్పిస్తున్న మండలి వెంకట్రామ్

అవనిగడ్డ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని అవనిగడ్డలో ఘనంగా నిర్వహించారు. గాంధీక్షేత్రంలో అబ్దుల్ కలాం విగ్రహానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు. వైసీపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నేతలు సింహాద్రి వెంకటేశ్వరరావు, రేపల్లె శ్రీనివాసరావు, గాజుల జైగోపాల్, చింతలపూడి బాలభాస్కరరావు, గరికపాటి కృష్ణారావు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో
ముక్కొల్లు చెరువు చుట్టూ ఫెన్సింగ్



ఫెన్సింగ్ పనులకు భూమిపూజ చేస్తున్న ముక్కొల్లు సర్పంచ్ సమ్మెట జయవర్ధన్

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముక్కొల్లు గ్రామంలోని సామూహిక రక్షిత నీటి పథకం చెరువు చుట్టూ రూ.20 లక్షలతో చేపట్టిన ఫెన్సింగ్ పనులకు బుధవారం సర్పంచ్ సమ్మెట జయవర్ధన్ భూమిపూజ చేశారు. ముక్కొల్లు గ్రామ అభివృద్ధికి జడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక రూ. 65.75 లక్షలు మంజూరు చేశారని సర్పంచ్ తెలిపారు. రక్షిత నీటి పథకం ఫిల్టర్‌బెడ్ ఆధునీకరణకు రూ.20 లక్షలు, రక్షిత నీటి పథకం చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మాణానికి రూ. 20 లక్షలు, గ్రామంలో అంతర్గత జీఎస్పీ రోడ్ల నిర్మాణానికి రూ. 12 లక్షలు, సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ. 8.75 లక్షలు, స్మశాన వాటికలో షెల్టర్ నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. జడ్పీ చైర్‌పర్సన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ సమ్మెట శంతన్‌కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కమలాపురం డీసీ చైర్మన్‌కు పరామర్శ

పెడన రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కమలాపురం డీసీ చైర్మన్ నల్లమోతు చంద్రమోహన్‌రావును బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్ పరామర్శించారు. చంద్రమోహన్‌రావు సతీమణి మృతిచెందటంతో ఆయన ఇంటికి వెళ్లి వేదవ్యాస్ ధైర్యం చెప్పారు. జనసేన నాయకులు గుడివాడ వెంకట్రావు, చిలంకుర్తి పృథ్వీప్రసన్న పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుదాం

● వయోజన విద్య జిల్లా డీడీ హాజీబేగ్

పెడన రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుదామని జిల్లా వయోజన విద్య డీడీ హాజీబేగ్ పిలుపునిచ్చారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అక్షరాంధ్ర(ఉల్లాస్) శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం హాజీబేగ్ నిర్వహించారు. మండలంలో పొదుపు సంఘాల్లో 1600 మంది, ఉపాధి కూలీల్లో 600 మంది నిరక్షరాస్యులు ఉన్నారని వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వలంటీర్లను నియమించామని తెలిపారు. ఎండీవో ఎ.అరుణకుమారి. ఎంఈవో హరనాథ్, ఏపీవో వ జీర్, సీసీలు వెంకటేశ్వర్లు, తులసిబాల, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందాం

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుందామని తుమ్మలపాలెం పంచాయతీ పరిధిలోని ప్రజలకు మల్లవోలు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. ఇంటింటికీ వెళ్లి నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. గ్రామంలో ర్యాలీ, ఫీవర్ సర్వే నిర్వహించారు. వి.సరళ, సుబ్రహ్మణ్యం, కీర్తి పాల్గొన్నారు.

స్వతంత్రపురంలో జంగిల్ క్లియరెన్స్



యంత్రంతో పిచ్చిమొక్కలు తొలగింపు, రోడ్డు చదును చేయిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు

కోడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వతంత్రపురం గ్రామంలో రోడ్డును అభివృద్ధి చేయడం కోసం టీడీపీ మండల నేతలు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. రోడ్డుకిరువైపులా పిచ్చిమొక్కలు ఉన్నాయని, రోడ్డుపై నీరు నిలుస్తోందని, నడిచేందుకు ఇబ్బందిగా ఉందని, రోడ్డు అభివృద్ధి చేయమని స్థానిక టీడీపీ నేతలు వీరంకి వెంకటేశ్వరరావు, బొడ్డు వెంకన్నను గ్రామస్థులు కోరారు. దీంతో వారు పార్టీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారు. దీంతో తమ సొంత ఖర్చులతో జేసీబీ సాయంతో జంగిల్ క్లియరెన్స్, రోడ్డు లెవల్ పనులు చేయించినట్లు బండే శ్రీనివాసరావు తెలిపారు.

చేతుల శుభ్రతపై అవగాహన

అవనిగడ్డ రూరల్/నాగాయలంక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులను అరికట్టవచ్చని ఆరోగ్యశాఖ సీనియర్ సూపర్‌వైజర్ కమ్మిలి తారక రామారావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం చేతుల పరిశుభ్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చేతులు పరిశుభ్రం చేసుకునే ప్రక్రియ ఏడు దశల్లో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుంగల సుమతీదేవి, ఎంపీడీవో మరియకుమారి, సీనియర్ అసిస్టెంట్ వనజ, జూనియర్ అసిస్టెంట్ మహేంద్ర, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. నాగాయలంక మండలంలోని అంగన్వాడీ కేంద్రాల్లో బుధవారం ప్రపంచ హ్యాండ్ వాష్ డేను నిర్వహించారు. పిల్లలు, తల్లులకు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవడంపై అంగన్వాడీ కార్యకర్త కె.మొగదారమ్మ అవగాహన కల్పించారు. నాగాయలంకలోని 3వ అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎం.నిర్మలాజ్యోతి చేతుల శుభ్రతపై పిల్లలకు అవగాహన కల్పించారు.

లంకలకలవగుంటలో
పారిశుధ్య పనులకు రూ.20 లక్షలు

పెడన రూరల్ , అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆదర్శ గ్రామీణ యోజన కింద మండలంలోని లంకలకలవగుంట గ్రామం ఎంపికయిందని, దీంతో రూ.20 లక్షలు మంజూరు కానున్నాయని ఎండీవో ఎ.అరుణకుమారి తెలిపారు. గ్రామంలో పారిశుధ్యపనులకు, తాగునీటి అవసరాలకు నిధులు వాటిని వినియోగించాలని ఆమె సూచించారు. మంచినీటి చెరువుకు రక్షణ వలయం కావాలని, డ్రెయిన్లు నిర్మించాలని గ్రామస్థులు కోరారని తెలిపారు. ఫిల్టర్‌బెడ్, తాగునీటి సరఫరా విధానాన్ని ఆమె పరిశీలించారు.

● లంకలకలవగుంట అంగన్వాడీ కేంద్రంలో ఎండీవో ఎ.అరుణకుమారి చిన్నారుల చేతులను శుభ్రం చేయించారు. సర్పంచ్ కె.వెంకటలక్ష్మి, కార్యదర్శి జి.సాయి హవేలి, తల్లులు పాల్గొన్నారు.